## నర్సాపూర్‌లో స్వల్ప ఉద్రిక్తత

### సునీతాలక్ష్మారెడ్డి తనయుడి కారుపై దాడి

**మెదక్,నవంబర్30 :** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. కౌడిపల్లి మండలంలోని లింగంపల్లి బిట్ల తండాలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీత లక్ష్మారెడ్డి కుమారుడి వాహనంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. ఈ దాడిలో వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. వెంటనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపు చేసేందుకు యత్నించారు. ఒక్కసారిగా కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అసహనానికి లోనైన కాంగ్రెస్ శ్రేణులు దాడులకు పాల్పడుతున్నారని బిఆర్ఎస్ ఆరోపించింది. దాడితో నర్సాపూర్ నియోజకవర్గంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.బిట్లతండాలో బీఆర్ఎస్ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డి కుమారుడు వాకిటి శశిధర్ రెడ్డి కారుపై కాంగ్రెస్ కార్యక్కర్తలు దాడి చేశారు. ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వెళుతున్న శశిధర్ రెడ్డి కారుపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి తెగబడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తల దాడిలో శశిధర్ రెడ్డి కారు అద్దాలు ధ్వంసమయ్యాయి.

## ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్నారై

**హైదరాబాద్,నవంబర్30 :** అమెరికాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూ స్టాంపింగ్‌కు వచ్చిన ఓ ఎన్ఆర్ఐ అనుకోకుండా ఓటు హక్కును వినియోగించుకున్నారు. హైదరాబాద్ డి.డి. కాలనీకి చెందిన అవినాష్ మల్లం నార్త్ కరోలినాలో సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నారు. అమెరికా నిబంధనల ప్రకారం హెచ్ వన్ వీసా పొందిన వారు అప్పుడప్పుడు స్టాంపింగ్‌కు రావాల్సి ఉంటుంది. ఈ దఫా స్లాట్ నవంబర్ 30న దొరికింది. కొద్ది నెలల క్రితం ఈ స్లాట్ బుక్ చేసుకున్నారు. అప్పటికి ఎన్నికల తేదీ నిర్ధారణ కాలేదు. అయితే అనుకోకుండా తెలంగాణ రాష్ట్ర ఎన్నికలు ఇదే రోజు రావడంతో తనకు ఇక్కడ ఉన్న ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కలిగింది. ఒకే రోజు అటు స్టాంపింగ్ పూర్తి చేసుకోవడం, ఇటు ఓటు హక్కును వినియోగించుకోవడం అరుదైన అవకాశమే అని చెప్పొచ్చు.

## తలుపులు వేసి పోలీంగ్ నిర్వహణ

## అధికారులను నిలదీసిన కాంగ్రెస్ సభ్యులు

**మంచిర్యాల,నవంబర్30 :** చెన్నూర్ మండలంలోని పొన్నారం గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ స్టేషన్ 160లో ఎన్నికల అధికారులు తలుపులు పెట్టి పోలింగ్ నిర్వహించారు. ఈ విషయంపై ప్రశ్నించగా.. ఓటర్లను కంట్రోల్ చేయలేక డోర్స్ వేసి నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ విషయంపై స్పందించిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి తనయుడు వంశీ కృష్ణ.. ఎన్నికల అధికారుల తీరుపై మండిపడ్డారు. పోలింగ్ సిబ్బంది, పోలీసులను ప్రశ్నించారు. అనంతరం ఈ అంశంపై ఎన్నికల అధికారులకు కంప్లైంట్ చేస్తామని తెలిపారు. పొన్నారం గ్రామంలోని 160వ పోలింగ్ బూత్ లో పోలీసులతో సహా ఎలక్షన్ అధికారులు లోపల్నుంచి తలుపులు పెట్టి పోలింగ్ నిర్వహిస్తున్నారని వంశీ కృష్ణ ఆరోపించారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. తాము ఓటర్లను కంట్రోల్ చేయలేకపోతున్నామని చెబుతున్నారన్నారు. ఇది ఎన్నికల కమిషన్ అత్యంత సీరియస్ గా తీసుకోవాల్సిన విషయమని చెప్పారు. బీఆర్ఎస్ లీడర్లు తమ ఫోన్లపై లోగోలతో, సీక్రెట్ కెమెరాలతో వీడియోలు కూడా తీస్తున్నారని, వాళ్లనెవ్వరూ ఆపడం లేదని వంశీ చెప్పారు. ఈసీకి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ప్రచారంపై అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.అంతకుముందు మంచిర్యాలలో చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ వెంకటస్వామి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

## పోలీస్ అధికారితో ఎమ్మెల్యే సైదిరెడ్డి వాగ్వాదం

**నల్లగొండ,నవంబర్30 :** నేనే గెలుస్తా.. అప్పుడు నీ సంగతి చూస్తా.. నీ గొంతు తగ్గించుకొని చేసుకొని మాట్లాడు.. లేకపోతే నీ సంగతి చెప్తానంటూ ఎమ్మెల్యే సైదిరెడ్డి ఓ సీఐని బెదిరించారు. దీంతోసూర్యాపేట జిల్లా హుజూర్ నగర్ వీవీ మందిర్ స్కూల్ దగ్గర హై టెన్షన్ నెలకొంది. ఎమ్మెల్యే సైదిరెడ్డి తన అనుచరులతో కలసి బీఆర్ఎస్ పార్టీ కండువాలతో పోలింగ్ బూత్ కు ఓటు వేయడానికి వచ్చారు. దీంతో కండువా తీయమని డ్యూటీలో ఉన్న సీఐ చెప్పారు. దీంతో నేనే గెలుస్తా.. అప్పుడు నీ సంగతి చూస్తా.. నీ గొంతు తక్కువ చేసుకొని మాట్లాడు.. లేకపోతే నీ సంగతి చూస్తానంటూ ఎమ్మెల్యే సైదిరెడ్డి సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే, సీఐకి మధ్య వాగ్వాదం నెలకొంది. దీంతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## స్వగ్రామంలో ఓటేసిన బర్రెలక్క

**నాగర్‌కర్నూల్,నవంబర్30 :** కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మర్రికల్ గ్రామంలోని బూత్ నెంబర్ 12లో ఆమె ఓటు వేశారు. ఆమె కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలతో బర్రెలక్కకు ఈసీ సెక్యూరిటీ కూడా ఇచ్చింది. ఆ సెక్యూరిటీతోనే ఆమె పోలింగ్ కేంద్రం వద్దకు వచ్చి ఓటు వేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా బర్రెలక్క.. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఓటు వేసేందుకు అందరూ పోలింగ్ కేంద్రాలకు రావాలని కోరారు. ఇక ఈ ఎన్నికల్లో ఆమె నిరుద్యోగులకు న్యాయం చేసేందుకు వీలుగా కొల్లాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. అయితే, ఎన్నికల ప్రచార సమయంలో ఆమెకు తీవ్ర బెదిరింపులు వచ్చాయి. శిరీష తమ్ముడిపై దాడి కూడా జరిగింది. బర్రెలక్కకు వచ్చిన ఆదరణ చూసి, ఎన్నికల బరి నుంచి తప్పుకోవాలంటూ ఇతర పార్టీల అభ్యర్థులు ఆమెను బెదిరించారు. దీంతో ఆమె హైకోర్టును ఆశ్రయించడంతో గన్‌మెన్లతో సెక్యూరిటీని కల్పించారు ఎన్నికల అధికారులు.

## టిడిపి నేతకు హైకోర్టులో ఊరట

**అమరావతి,నవంబర్30 :** టీడీపీ నేత మహాసేన రాజేష్‌కు ఏపీ హైకోర్ట్‌లో భారీ ఊరట లభించింది. ఓ ఛానల్ యాంకర్, కంపెనీ సెక్రటరీ పెట్టిన కేసుల్లో ముందస్తు బెయిల్ కోసం రాజేష్ హైకోర్ట్‌ను ఆశ్రయించగా.. ఈరోజు(గురువారం) విచారణకు వచ్చింది. రాజేష్ తరపున న్యాయవాది ఉమేష్ చంద్ర వాదనలు వినిపించారు. మహాసేన రాజేష్ విషయంలో సీఆర్పీసీలోని 41ఏ ప్రకారం నోటీసులు ఇవ్వాలని హైకోర్ట్ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. కాగా.. నిన్న ఇదే కేసులో తెలంగాణ హైకోర్ట్‌లో రాజేష్‌కు ముందస్తు బెయిల్ మంజూరు అయిన విషయం తెలిసిందే.

## ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్ పోల్స్ ప్రసారం

### అనుమతించిన కేంద్ర ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ,నవంబర్30 :** ఎగ్జిట్ పోల్ ఫలితాల సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ మార్పులు చేసింది. పోలింగ్ ముగిసిన అరగంటలో ఎగ్జిట్ పోల్స్ ప్రసారం చేసుకోవచ్చని తెలిపింది. పోలింగ్ గురువారం సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న నేపథ్యంలో 5.30 గంటల నుంచే ఎగ్జిట్ పోల్ ఫలితాలను ప్రసారం చేయవచ్చునని సీఈసీ పేర్కొంది. గతంలో ఇచ్చిన ఆదేశాలను సవరిస్తూ ఈ మేరకు ప్రకటన చేసింది. గతంలో పోలింగ్ జరిగే రోజు సాయంత్రం 6.30 గంటల వరకు ఎగ్జిట్ పోల్ ఫలితాలపై నిషేదం విధించింది.

## ఓటేయడానికి వచ్చిన ఇద్దరు వృద్ధుల మృతి

**ఆదిలాబాద్,నవంబర్30 :** ఆదిలాబాద్ పట్టణంలో ఓటు వేసేందుకు వచ్చిన ఇద్దరు వృద్ధులు అస్వస్థతకు గురై మృతి చెందారు. మావలకు చెందిన తోకల గంగమ్మ(78) ఓటు వేయడానికి పోలింగ్ బూత్ కు రావడంతో ఫిట్స్ వచ్చాయి. దీంతో ఆమెను రిమ్స్‌కు తరలించే లోపే మృతి చెందింది. అదేవిధంగా భుక్తాపూర్కు చెందిన రాజన్న (65) ఓటు వేయడానికి వచ్చి వరుసలో నిలబడ్డాడు. అంతలోనే కళ్లు తిరిగి పడిపోవడంతో రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు.

## ఓటేస్తూ సెల్ఫీ..పోలీసుల కేసు నమోదు

**సూర్యాపేట,నవంబర్30 :** నడిగూడెం గ్రామం కాగిత రామచంద్రపురంలో ఓటు వేసేటప్పుడు సెల్ఫీ వీడియో తీసిన ఓటరుపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలింగ్ బూత్‌లోకి సెల్ ఫోన్ తీసుకెల్లి ఓటు దేనికి వేస్తున్నానో ఫోటో తీసి మరి ఓ ఓటర్ ప్రచారం చేస్తున్నారు వైనం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. పోలింగ్ కేంద్రం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఉన్నప్పటికీ ఆ ఓటర్ పోలీస్ అధికారుల కళ్లు గప్పి మొబైల్ ఫోన్ పోలింగ్ కేంద్రంలోకి తీసుకెళ్లాడు. ఓటు వేసే సమయంలో తన ఫోన్‌తో ఓటర్ సెల్ఫీ తీసుకున్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేసి సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోనున్నారు.

# ఎన్నికల్లో గుర్తొచ్చిన ప్రజాసంఘాల, మేధావుల అవసరం

- తెలంగాణ ఉద్యమకాలంలో చెమటోడ్చిన వారు కావాలా?
- ప్రజాస్వామ్యం అంటే ప్రజా హక్కుల నాయకులు-ఉద్యమకారులు
- వీరి సంభాషణలోని మర్మం ఏమిటి- ఎందుకు?

**-సిహెచ్ వి ప్రభాకర్ రావు సీనియర్ జర్నలిస్ట్, 991533339**



తెలంగాణ రాష్ట్ర శాసన సభకు జరిగిన ఎన్నికలు ప్రశాంత వాతావరణ పరిస్థితులలో పూర్తికావడం ప్రజల చైతన్యానికి, సహనానికి ప్రతీక. ఎన్నికల సందర్భంగా ఎన్నో ప్రచారాలు, విమర్శలు, ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకొన్న నాయకులు, ఎన్నికలకు ముందు చాలా సంయమనం పాటించడం గొప్ప విషయం. అలాగే, గత పదేఏళ్లలో మారిచిపోయిన మేధావుల పాత్ర, సమాజంలో అలాంటి వారి అవసరాన్ని ఈ ఎన్నికల్లో రాజకీయ నాయకులు గుర్తించడం శుభసూచకమే. రాజకీయ నాయకులకు సంబందించిన సామాజిక మాధ్యమాల ద్వారా ఎంతో గొప్పగా తమ నాయకత్వ ప్రతిభను, తాము చేసిన అభివృద్ధిని, సామాజిక కార్యక్రమాలను ఎంతగా ప్రచారం చేసుకొన్నా, సామాజిక మాధ్యమాల పాత్ర గ్రామీణ ఓటర్లలో చాలా తక్కువే అని రాజకీయ నాయకులకు అర్థం అయింది. లక్షలలో ఖర్చు చేసి ప్రతి రాజకీయ పార్టీ తమకంటూ ప్రత్యేక సామాజిక విభాగాన్ని గ్రామా స్థాయిలో ఏర్పాటు చేసి, ఎదుటి వారిపై విమర్శల వర్షం కురిపించింది. సామాజిక మాధ్యమాలలో కార్యకర్తలు, నాయకులు చేసిన, చేసుకొన్న ప్రచారానికి ప్రజలలో నమ్మకం లేదని గ్రహించి కాబోలు కాలవకుంట్ల తారక రామారావుతో మొదలు పెట్టి రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి లతో సహా పలువురు అనేక మంది మేధావులతో సంభాషణ, ముఖాముఖీ కార్యక్రమాలు నిర్వహించి, అన్నీ ప్రముఖ టీవి ఛానళ్లలో ప్రసారాం చేశారు. ఈ పదేళ్లల్లో కనీస గుర్తింపు పొందలేని, ఒకరకంగా వివక్షకు గురైన, తెలంగాణ సమాజం గుర్తించిన మేధావులు, ప్రజా సంఘాల నాయకులు అవసరాన్ని గుర్తించి, వారిని తెరపైకి తేవడమే ఈ ఎన్నికల విశేషంగా చెప్పవచ్చు. తెలంగాణ ఉద్యమ సమయంలో, తెలంగాణ ఉద్యమ నాయకులు పూర్తిగా వ్యతిరేకించిన, ఒక దశలో శాసన సభ్యునిగా ఉన్న లోక్ సత్తా అధ్యక్షులు, పలు సామాజిక ఉద్యమాల నిర్మాత నాగభైరవ జయప్రకాష్ నారాయణ పై దాడిచేసిన తెలంగాణ రాష్ట్ర సమితి నాయకులతో కలిసి ఆయన గంటల తరబడి సంభాషించిన వీడియోను, గంటకుపైగా నిడివితో ఎడిట్ చేసి, అన్నీ ప్రముఖ ఛానల్లో విరివిగాప్రారం చేశారు. అలాగే దాన్ని యూట్యూబ్ లో కూడా ప్రచారం చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి లేదా భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వ్యవహార తీరును నిర్ద్వందంగా ఖండించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వాహణ పై మొదటగా, తీవ్ర విమర్శలు చేశారు. అలాంటి మేధావితో కేటీఆర్ సంభాషించడం, రెండు భిన్న ధృవాల కలయికగా తెలంగాణ ప్రజలు భావించారు. ఆయన కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాలన బాగుందని, హైదరాబాద్ అభివృద్ధి చూస్తే మరోడిల్లిలా ఉందనే రీతిలో చెపుతూ, మళ్ళీ వోటు వేయమని చెప్పడమే విశేషం. దానికి ఆయన ఇతర ఛానళ్లలో ఇస్తున్న వివరణలు ఆయనకు ఉన్నాయి. అలాగే తెలంగాణ ఉద్యమ కాలంలో ఉద్యమానికి ఆయువు ఆట పాటలో ప్రాధాన్య పాత్ర నిర్వహించిన పాత, తెలంగాణ ప్రార్ధనా గీతంలా అందరూ భావించిన "జయ జయహే తెలంగాణ -జననీ జయకేతనం" గీత రచయిత అందెశ్రీ, తెలంగాణ ఏర్పడ్డ తరువాత, అనుకోకుండా తెరమరుగయ్యారు. అలాంటి వైతాళికుని లాంటి అందెశ్రీ తో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రఅధ్యక్షుడు రేవంత్ రెడ్డి జరిపిన సంభాషణ ఎంతో సంచలనం అయింది. అందెశ్రీ తో ఏకీభవించినా, వ్యతిరేకించినా, తన 10-15 సంవత్సరాల తెలంగాణ ఉద్యమ ప్రస్థానానాన్న, తెలంగాణ రాష్ట్ర సమితి అధ్యక్షులు కల్వకుంట్ల చణద్రశేఖర్ రావుతో ఉన్న పరిచయాన్ని గుర్తుచేసుకొంటూ, ప్రభుత్వ తీరుపై, ఉద్యమ కారుల దుస్థితిపై మొహమాటం లేకుండా మాట్లాడడమే కాకుండా, రేపటి ప్రభుత్వం లో ఎలా ఉండకూడదో, ఎలా నడాలో కూడా స్పష్టంగా చెప్పారు. రేవంత్-అందెశ్రీ ల సంభాషణ గత పదేళ్ళ కాలంలో ప్రజాసంఘాల, మేధావుల, ఉద్యమాకారుల ఆలోచనలకు అద్దం పట్టినట్లుగా ఉందని భావవిస్తున్నారు. మిగతా టీవి ఇంటర్వ్యూలకు వీరి సంభాషణకు ఎంతో తేడా ఉంది. అందెశ్రీ ఒక్కడే కాకుండా, పౌర హక్కుల నాయకులు హరగోపాల్ తో పాటు కోదండ రామ్, ప్రముఖ పాత్రికేయులు కె. రామచంద్ర మూర్తి లతో సంయుక్తంగా చేసిన సంభాషణ, కాంగ్రెస్ పార్టీ, ప్రజా సంఘాల పట్ల,పౌర హక్కుల ఉద్యమ నాయకుల పట్ల చూపుతున్న ఆదరణ, చొరవ కనబడుతుంది. కానీ గతాన్ని మరవకూడదు. ఎన్టీఆర్, చెన్నారెడ్డి, రాజశేఖర్ రెడ్డిలు కూడా గతంలో ఇంతకంటే ఎక్కువ ప్రాధాన్యతే ఇచ్చినా, తరువాతి కాలంలో వ్యవహరించిన తీరును మరిచిపోవద్దని ప్రజాసంఘా ల నాయకులు హెచ్చరిస్తున్నారు. ఇక ప్రతి టీవి ఛానలు వారు ఎన్నికల ప్రచారంలో భాగంగా ( అవి పెయిడ్ ఇంటర్వ్యూ లే కావచ్చు) కేటీఆర్, రేవంత్ రెడ్డిలతో ప్రత్యేక చర్చల పేర ప్రచారం చేయించారు. దీనికి తోడుగా, కేటీఆర్ నిరుద్యో గులతో, యూట్యూబర్ గంగవ్వ టీం తో వీడియోలు చేసి ప్రచారం చేశారు. హిందీ యూట్యూబర్ సందీశ్ తో చేసిన వీడియో ఆన్ ఫిల్టరడ్ యూట్యూబ్ చానల్ లో ప్రసారం చేశారు. గతంలో లేని విధంగా ఈ సారి అన్నీ పార్టీలు కొత్తరకంగా ప్రచారం చేసుకొంటూ, ప్రజల మనసు దోచుకొని, ఓట్లు కొల్లగొట్టాలని ప్రయత్నించింది. ఈ సంభాషణాలలోని అంతరార్థాన్ని ప్రజలు గ్రహిస్తూనే ఉన్నారు. సాధారణంగా జరిగే ప్రచారంతో పాటు ధన, మద్యం ప్రభావం మరింత ఎక్కు వగా ఈ ఎన్నికల్లో కనబడింది. ప్రజల మనసులో ఏముందో తెలుసుకోవలనే ప్రయత్నం చేసిన అందరి ఎగ్జిట్ పోల్స్, అభ్యర్థులలో, పార్టీలలో,ఇతర రాజకీయ నాయకులలోనే కాకుం డా ప్రజాలలో కూడా అయోమయాన్ని సృష్టిస్తూ, అందరినీ సంతృప్తి పరిచే విధంగా తమ పోల్స్ ఫలితాలను ప్రకటిం చాయి. ప్రజలు కూడా ఎంతో శ్రమ అయినా, దూరం అయినా, క్యూ లైన్లలో నిలబడి తమ నాయకులను ఎన్నుకోవడానికి వేసిన వోట్లన్ని, ఈవీఎంలలో బాధరంగా ఉన్నాయి. వాటిలో ఏముం దో ఆదివారం మధ్యాహ్నం వరకు తెలిసిపోతుంది. అంతవరకు అందరూ సంయమనంతో, ఓపికగా, ఆతృతతో ఎదిరిచూడక తప్పదు.

## ఇసుక కేసులో చంద్రబాబు బెయిల్ పిటిషన్

### డిసెంబర్ 6కు వాయిదా వేసిన హైకోర్టు



**అమరావతి,నవంబర్30:** ఇసుక కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటీషన్‌పై విచారణను హైకోర్టు డిసెంబర్ 6కు వాయిదా వేసింది. గురువారం ఏపీ హైకోర్టులో చంద్రబాబు ముందస్తు బెయిల్ కేసులో సీఐడీ తరపున అడ్వకేట్ జనరల్ వాదనలు వినిపించాల్సి ఉంది. అయితే ఈరోజు విచారణకు వచ్చిన సమయంలో తమకు మరింత గడువు కావాలని కోర్టును సీఐడీ న్యాయవాది కోరారు. దీనిపై చంద్రబాబు తరపున న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. తాము వాదనలు పూర్తి చేశామని, సీఐడీ తరపు న్యాయవాదులు కావాలనే ఆలస్యం చేస్తున్నారని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వాదనలు విన్న హైకోర్టు సీఐడీ తరపున న్యాయవాదుల వాదనల కోసం డిసెంబర్ 6కు విచారణను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఫైబర్ నెట్ స్కాంలో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ చంద్రబాబు దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టులో మరోసారి విచారణ వాయిదా పడింది. గత విచారణ సమయంలో చంద్రబాబు దాఖలు చేసుకున్న క్వాష్ పిటిషన్ పై తీర్పు తర్వాత విచారణ చేస్తామని తెలిపామని ఆ తీర్పు ప్రాసెస్ లో ఉన్నందున విచారణను వాయిదా వేస్తున్నామని జస్టిస్ అనిరుద్ధబోస్ ధర్మాసనం తెలిపింది. క్వాష్ పిటిషన్ పై తీర్పు డిసెంబర్ పన్నెండో తేదీ లోపు వస్తుందని భావిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్ కేసులో టీడీపీ చీఫ్ చంద్రబాబు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ పై తీర్పును సుప్రీం కోర్టు అక్టోబర్ 18వ తేదీన రిజర్వ్ చేసింది. అప్పటి నుంచి తీర్పు పెండింగ్ లో ఉంది. గత విచారణ సమయంలో చంద్రబాబు దాఖలు చేసుకున్న క్వాష్ పిటిషన్ పై తీర్పు తర్వాత విచారణ చేస్తామని తెలిపామని ఆ తీర్పు ప్రాసెస్ లో ఉన్నందున విచారణను వాయిదా వేస్తున్నామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. పన్నెండో తేదీకి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నారు. క్వాష్ పిటిషన్ పై తీర్పు డిసెంబర్ పన్నెండో తేదీ లోపు వస్తుందని భావిస్తున్నారు. చంద్రబాబుపై ప్రభుత్వం పెట్టిన ఇబ్బడిమబ్బడి కేసుల గురించి అటు ఏసీబీ కోర్టులో.. ఇటు హైకోర్టులో.. సుప్రీంకోర్టులో అదే పనిగా విచారణకు వస్తున్నాయి. కానీ క్వాష్ పిటిషన్ పై తీర్పు రాని కారణంగా వాయిదా పడుతూ వస్తున్నాయి. చివరికి చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై విచారణ కూడా ఈ కారణంగానే వాయిదా పడింది. ఆ కేసు పదకొండో తేదీకి వాయిదా పడింది. హైకోర్టులో కూడా వివిధ కేసుల్లో ముందస్తు బెయిల్స్ పై విచారణ కూడా వాయిదాల మీద వాయిదాలు పడుతుంది. క్వాష్ పిటిషన్ తీర్పు చంద్రబాబుకు అనుకూలంగా వస్తే.. ఆయన పై పెట్టినకేసులన్నీ అక్రమం అని తేలుతాయి. కోర్టుల్లో ఉన్నవన్నీ తేలిపోతాయి. వాటికి విచారణ అర్హత కూడా ఉండదు. ఒక వేళ చంద్రబాబుకు 17ఏ వర్తించదని సుప్రీంకోర్టు చెబితే మాత్రం.. అన్ని కేసుల్లో విచారణలు దాదాపుగా పూర్తయినందున.. తీర్పులు వెల్లడించాల్సి ఉంటుంది. ఎన్నికలు ముంచుకొస్తున్న సమయంలో చంద్రబాబును రాజకీయానికి దూరం చేయాలనుకుంటున్న జగన్ రెడ్డి పన్నాగాలు వర్కవుట్ అవుతాయా లేదా అన్న క్వాష్ పిటిషన్ పై తీర్పును బట్టి వెల్లడయ్యే అవకాశం ఉండటంతో.. అందరిలోనూ ఆసక్తి ఏర్పడింది.

## 4 నుంచి పార్లమెంట్ శీతాకాల సమావేశాలు

### 2న అఖిలపక్ష భేటీకి సన్నాహాలు

**న్యూఢిల్లీ,నవంబర్30 :** పార్లమెంట్ శీతాకాల సమావేశాల నేపథ్యంలో డిసెంబర్ 2న అఖిల పక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉన్నట్లు సంబంధిత వర్గాలు గురువారం తెలిపాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి సీనియర్ నేతలు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్; వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌లు హాజరు కానున్నట్లు ఆ వర్గాలు వెల్లడించాయి.డిసెంబర్ 4 నుండి 22 వరకు పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ సమావేశాల్లో వలసకాలం నాటి క్రిమినల్ చట్టాల స్థానంలో మూడు బిల్లులను ప్రవేశ పెట్టనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పార్లమెంటులో 37 బిల్లులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 12 పరిశీలన మరియు ఆమోదం కోసం జాబితా చేయగా, ఏడు బిల్లులు ప్రవేశపెట్టడం, పరిశీలన, ఆమోదం కోసం జాబితా చేసినట్లు సమాచారం. 2023-24 సంవత్సరానికి గాను గ్రాంట్ల కోసం సప్లిమెంటరీ డిమాండుల మొదటి బ్యాచ్‌ను కూడా ప్రభుత్వం సమర్పించనున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ప్రశ్నల కోసం నగదు ఆరోపణల్లో తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాపై ఎథిక్స్ కమిటీ నివేదికను కూడా ఈ సమావేశంలో లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని పేర్కొన్నాయి.

# తెలంగాణలో ముగిసిన పోలింగ్

### క్యూలో ఉన్న వారికి ఓటేసే ఛాన్స్

### 65 నుంచి 68 శాతం మధ్యలో పోలింగ్

### 3న కౌంటింగ్ ప్రక్రియ...అదేరోజు ఫలితాల ప్రకటన



**హైదరాబాద్,నవంబర్30 :** తెలంగాణలో పోలింగ్ పక్రియ ముగిసింది. సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లో ఉన్న వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాలతో పోల్చుకుంటే పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ మందకొడిగా ఉందని సమాచారం అందింది. మొత్తం మీద తెలంగాణలో 65 నుంచి 68 శాతం మధ్యలోనే పోలింగ్ నమోదవుతుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో 2018 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం తగ్గనుంది. 3న ఓట్ల లెక్కింపు జరుగనుంది. 3న ఉదయం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. 2018 ఎన్నికల్లో 73 శాతం పోలింగ్ నమోదైంది. కాగా రాత్రి 7 గంటల తర్వాత పోలింగ్ శాతాన్ని ఈసీ అధికారికంగా వెల్లడించనుంది. 119 నియోజకవర్గాల్లో ఉదయం 7 గంటల నుంచి పక్రియ ప్రారంభం కాగా, కొన్ని చోట్ల ఓటర్లు ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొన్నారు. కాగా, కొన్ని చోట్ల ఈవీఎంల మొరాయింపుతో ఓటర్లు క్యూలో ఇబ్బంది పడ్డారు. అటు, హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైంది. ఓటు వేయాలని ఎన్నికల సంఘం, పలువురు ప్రముఖులు ఎంత అవగాహన కల్పించినా మార్పు రాలేదు. సమస్యాత్మక కేంద్రాల్లో 13 నియోజకవర్గాల్లోనే పోలింగ్ ముగిసింది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ముగిసింది రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసింది. 5 గంటల లోపు క్యూలైన్లలో నిల్చున్న వారికి మాత్రమే ఓటేసేందుకు అధికారులు అనుమతిస్తున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటలకే పోలింగ్ ముగిసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఉదయం 7 గంటలకు పోలింగ్ మొదలైంది. సాయంత్రం 5 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రజాస్వామ్య పండుగలో సాధారణ ఓటర్లతో పాటు సెలబ్రిటీలూ ఓటేసేందుకు పోటెత్తారు. సాధారణ పౌరుల్లా క్యూలో నిల్చొని మరీ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో 2,290 మంది అభ్యర్థులు బరిలో నిలువగా.. 3,26,18,205 మంది ఓటర్లలో ఎంత శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారో తెలియాల్సి ఉంది. సాయంత్రం 3 గంటల వరకు 52 శాతం పోలింగ్ నమోదైనట్లు సమాచారం. డిసెంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

# బిఆర్ఎస్ చరిత్ర సృష్టిస్తుంది

## మళ్లీ విజయం కెసిఆర్‌దే అన్న కవిత




హైదరాబాద్,నవంబర్30 :తెలంగాణ గడ్డ ఉద్యమాల గడ్డ, చైతన్యవంతమైన గడ్డ అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పింక్ వేవ్ కనిపిస్తోందని అన్నారు. గురువారం జుబ్లీహిల్స్ లోని పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ చరిత్ర స్రుష్టిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ మళ్లీ విజయం సాధించి అధికారం చేపడతారని పేర్కొన్నారు.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులతోపాటు ఎమ్మెల్సీ కవిత అవిశ్రాంతంగా ప్రచారం చేశారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో పార్టీ అభ్యర్థుల తరపున భారీ ఎత్తున ప్రచారంలో పాల్గొన్నారు.

# వచ్చే ఏడాదికి సాధారణ సెలవులు

## మొత్తం 20 రోజులు సాధారణ సెలవులుగా ప్రకటన

**అమరావతి,నవంబర్30 :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2024లో వచ్చే సాధారణ సెలవులపై ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ సెలవులతో పాటు పండుగలను కలిపి ప్రభుత్వ కార్యాలయాలకు మొత్తం 20 రోజులు. సాధారణ సెలవులు, 17 రోజులు ఐచ్చిక సెలవులుగా ప్రకటించింది . జనవరి 15న మకర సంక్రాంతి, 16న కనుమ పండుగ సెలవులను ప్రకటించింది. జనవరి 26న రిపబ్లిక్ డే, మార్చి 3న మహా శివరాత్రి, మార్చి 25న హోళీ, మార్చి 29న గుడ్ ఫ్రైడే సెలవులుంటాయని ప్రకటిస్తున్నట్లు ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఏప్రిల్ 5న బాబు జగ్జీవన్‌రాం జయంతి, 9న ఉగాది, 11న రంజాన్, 17న శ్రీరామ నవమి, జూన్ 17న బక్రీద్ సెలవులుంటాయని తెలియజేసింది. జూలై 17న మొహర్రం, ఆగస్టు 15 ఇండిపెండెన్స్ డే, 26 శ్రీ కృష్ణాష్టమి, సెప్టెంబర్ 7న వినాయక చవితి సెలవులు, 16న ఈద్-ఉల్-ఉన్-నబీ పండుగల సందర్భంగా సెలవులను అమలు చేయనున్నట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. అక్టోబర్ 2న గాంధీ జయంతి, అక్టోబర్ 11న దుర్గాష్టమి, 31న దీపావళి, డిసెంబర్ 25న క్రిస్మస్ సెలవులు ఉంటాయని వెల్లడించింది . వీటితో పాటు మరో 17 ఐచ్ఛిక సెలవుల తేదీలను ప్రకటించింది . కర్ణాటకలో దారుణం

# మహిళా టీచర్ కిడ్నాప్

**బెంగళూరు,నవంబర్30 :** కర్ణాటకలో దారుణం జరిగింది. పట్టపగలే మహిళా టీచర్‌ను కొందరు కిడ్నాప్ చేశారు. బలవంతంగా ఎస్‌యూవీలోకి నెట్టి అపహరించారు. కర్ణాటకలోని హసన్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్న 23 ఏళ్ల అర్పిత గురువారం సెలవు సందర్భంగా మూసి ఉన్న ఆ స్కూల్ బయట ఉంది. ఒక ఎస్‌యూవీ మెల్లగా ఆమె వద్దకు వచ్చింది. సమీపంలో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఆమెను బలవంతంగా ఆ వాహనంలోకి ఎక్కించారు. కేకలు వేస్తున్న ఆమెను కిడ్నాప్ చేసి అక్కడి నుంచి తీసుకెళ్లారు. కాగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు మూడు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. అర్పిత కిడ్నాప్ వెనుక బంధువైన రాము ప్రమేయం ఉన్నట్లు ఆమె తల్లి చెప్పిందన్నారు. వారిద్దరి మధ్య నాలుగేళ్లుగా పరిచయం ఉన్నట్లుగా తెలిసిందని చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని కోణాల్లో ఈ కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. మరోవైపు ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# ఎమ్మెల్యే రేగాకు నిరసనలు

## కాంగ్రెస్ నినాదాలతో ఉద్రిక్తత

**భద్రాద్రి,నవంబర్30 :** అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరుగుతున్న వేళ పలు చోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకుంటోంది. భద్రాద్రి కొత్త గూ జిల్లా పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు వచ్చారు. ఆయన్ని చూసి అక్కడే ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు జై కాంగ్రెస్ అంటూ నినాదాలు చేశారు. ఒక్కసారిగా ఎమ్మెల్యే వైపుగా దూసుకురావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడే ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని లాఠీఛార్జ్ చేసి కార్యకర్తలను చెదరగొట్టారు. ఇదిలావుంటే ఖమ్మంలో మాజీమంత్రి తుమ్మల ఓటుహక్కును వినియోగించుకున్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఓటు హక్కును వినియోగించుకున్నారు. మదిరలో కుటుంబసమేతంగా భట్టి ఓటు వేశారు. మధిర పట్టణంలోని సుందరయ్య నగర్ మండల ప్రజా పరిషత్ పాఠశాల పోలింగ్ కేంద్రంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, సతీమణి మల్లు నందిని విక్రమార్క, కుమారుడు మల్లు సూర్య విక్రమాధిత్య ఓటుహక్కును వినియోగించుకున్నారు.

# కనకదుర్గమ్మ ఆలయంలో పాము కలకలం

## పామును పరుగులు తీసిన సిబ్బంది

విజయవాడ,నవంబర్30 : విజయవాడ లోని ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఒక్కసారిగా ఓ పాము కలకలం సృష్టించింది. దీనితో అక్కడ పని చేసే సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న అమ్మవారి ఆలయం లోని స్కానింగ్ సెంటర్ టికెట్ కౌంటర్లో పాము దర్శనమించింది. కాగా ఆ పాముని చూడగానే కౌంటర్లో ఉన్న సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. ఆలయ సిబ్బంది అధికారులకు సమాచారం అందించారు.సమాచారంఅందుకున్న ఆలయ అధికారులు పాములు పట్టే వ్యక్తిని పిలిపించారు.పాములు పట్టే వ్యక్తి ఘటన స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఆ వ్యక్తి పాముని పట్టుకుని కొండ పైన వదులుతానని.. పాములను చంపకూడదని చెప్పారు. అనంతరం ఆ పాముని పట్టుకున్నారు.ఆ పాము విషం లేని పాము కావడం చేత అందరూ ఊపిరి పీల్చుకు న్నారు. పాములుపెట్టేవ్యక్తి పామును పట్టుకున్నారు. అనంతరం ఆ పాముని ఆలయ ప్రాంగణానికి దూరంగా తీసుకు వెళ్లి కొండ పైన వదిలేశారు. కాగా ఒక్కసారిగా పాముని చూసేసరికి భయాందోళనకు గురయ్యామని.. అయితే కొన్ని నిమిషాల్లోనే పరిస్థితి చక్కబడిందని ఆలయ సిబ్బంది తెలిపారు.

# ఉత్తర తెలంగాణలో పెరిగిన ఓటర్లు తగ్గిన పోలింగ్ శాతం

నియోజక వర్గాలు నమోదు చేశాయి. 2018 తో పోలిస్తే 2023సం.లో 02 నియోజకవర్గాల పోలింగ్ నిజామాబాద్ 59.1%, కరీంనగర్ 64.17% వరుస తేడా 3%, 5% లు అతి స్వల్పంగా పోలింగ్ శాతం నమోదు అయ్యాయి. 03 నియోజకవర్గాల పోలింగ్ ధర్మపురి 77.5%, బెల్లంపల్లి 76.79%, భోథ్ 75.3% ఈసారి 2023సం. లో అత్యధికంగా పోలింగ్ శాతం నమోదు అయ్యాయి. కాగా, ఉత్తర తెలంగాణ లో 06 ఎస్.సి నియోజక వర్గాలు ఉన్నాయి. అవి : ధర్మపురి, చెన్నూర్, బెల్లంపల్లి, జుక్కల్, చొప్పదండి, మానకొండూర్. 2018సం. లో 85.56% తో జుక్కల్ నియోజక వర్గం అత్యధిక పోలింగ్ శాతం నమోదు కాగా 79.72% తో చొప్పదండి నియోజక వర్గం అత్యల్ప పోలింగ్ శాతం నమోదు చేసింది. నేడు 2023సం. లో ధర్మపురి నియోజక వర్గం 77.5% తో అత్యధిక పోలింగ్ శాతం నమోదు చేస్తే, 70.20% తో మళ్ళీ చొప్పదండి నియోజక వర్గం అత్యల్ప పోలింగ్ శాతం నమోదు చేసింది. అలాగే ఈ ప్రాంతంలో 03 ఎస్.టి నియోజక వర్గాలు ఉన్నాయి. అవి: భోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్. 2018సం. లో 86.26% తో ఆసిఫాబాద్ నియోజక వర్గం లో అత్యధిక పోలింగ్ శాతం నమోదు కాగా, 80.86% తో ఖానాపూర్ నియోజక వర్గం అత్యల్ప పోలింగ్ శాతం నమోదు చేసింది. నేడు 2023సం. లో భోథ్ నియోజక వర్గం 75.3% తో అత్యధిక పోలింగ్ శాతం నమోదు చేస్తే, 72.08% తో ఆసిఫాబాద్ నియోజక వర్గం అత్యల్ప పోలింగ్ శాతం నమోదు చేసింది. రాష్ట్ర ఎ్నికల సంఘం రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించిన 13 సమస్యాత్మక నియోజక వర్గాలలో 06 ఉత్తర తెలంగాణ లో ఉండడం గమంచదగినవి అందులో 02 ఎస్.సి నియోజక వర్గాలు చెన్నూర్, బెల్లంపల్లి, 01 ఎస్.టి నియోజక వర్గం ఆసిఫాబాద్ గా ఉంటూ మంచిర్యాల, మంథు, సిర్పూర్ లు కూడా ఉన్నాయి. గురువారం సాయంత్రం 05గంటల వరకు ఎ్నికల సంఘం విడుదల చేసిన ఈ పోలింగ్ నమోదు విలువలు మొత్తం గా కాకపోయినా మరో 02-03% వరకు ఈ అంకెలు మారే అవకాశం లేకపోలేదు. ఏది ఏమైనా 2018సం. సార్వత్రిక ఎ్నికల తో పోలిస్తే 2023సం. లో సరాసరి 10% పోలింగ్ శాతం తగ్గడం ఎ్నికల ఫలితాలపై మరింత ఉత్కంఠతో కూడిన అయోమయాకి తెర తీసినట్లు అయ్యింది.

**సిరిసిల్ల. రాజా విక్రాంత్ శర్మ.**

# తెలంగాణలో అనూహ్య ఫలితాలు

**అధికారానికి చేరువగా కాంగ్రెస్**

**అన్ని సర్వే సంస్థల్లోనూ ఇదే వెల్లడి**

**కామారెడ్డిలో కెసిఆర్ ఓటమి తప్పదన్న అంచనాలు**

**గజ్వేల్‌లో బొటాబొటీ మెజార్టీతో గెలుస్తారని వెల్లడి**

**కొల్లాపూర్‌లో వణుకు పుట్టించిన బర్రెలక్క**

హైదరాబాద్,నవంబర్30 : తెలంగాణలో హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు రాబోతున్నట్లు పలు సర్వే సంస్థలు వెల్లడించాయి. దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్‌లో .. కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చే అవకాశం ఉందని తేల్చాయి. అధికార బిఆర్ఎస్ రెండో స్థానానికి పరిమితం కావడంతో పాటు, కామారెడ్డిలో కెసిఆర్ ఓడిపోతున్నట్లుగా తేల్చాయి. కొంచెం అటుఇటుగా అన్ని సంస్థలు కాంగ్రెస్‌కు సానుకూలత ఉన్నట్లు సర్వే ఫలితాలను వెల్లడించాయి. ఇండియా టివి,ఎబిపి, సిఎన్ఎన్,జన్‌కీ బాత్,పల్స్ టుడే వంటి సంస్థలు సర్వే చేపట్టాయి. అదే సమయంలో హంగ్ అసెంబ్లీ అంచనాలను కూడా తోసిపుచ్చలేమని ఏబీపీ సీఓటర్ నిర్వహించిన ఎగ్జిట్ పోల్‌లో స్పష్టమయింది. కాంగ్రెస్ పార్టీకి 49 నుంచి 65 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉందని తేలింది. అదే సమయంలో భారత రాష్ట్ర సమితికి 38 నుంచి 54 సీట్లు వచ్చే అవకాశం ఉంది. భారతీయ జనతా పార్టీ కూటమికి మూడు నుంచి 13 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ తేల్చాయి. ఇతరులు 5 నుంచి 9 స్తానాల్లో గెలుస్తారు. ఇతరుల్లో మజ్లిస్ పార్టీ కూడా ఉంది. ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం కాంగ్రెస్ పార్టీకి 40.7 శాతం ఓట్లు వస్తాయి. అంటే గత ఎన్నికలతో ఓటింగ్ పర్సంటేజీ దాదాపుగా 12.4 శాతం పెరుగుతుంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కేవలం 28.3 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. భారత రాష్ట్ర సమితికి ఏకంగా 8.1 శాతం ఓట్లు తగ్గబోతున్నాయి. ఆ పార్టీకి 38.8 శాతం వరకూ ఓట్లు వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి 46.9 శాతం ఓట్లు వచ్చాయి. భారతీయ జనతా పార్టీ ఓట్ల శాతం పరంగా భారీగా లబ్ది పొందుతోంది. గత ఎన్నికల్లో కేవలం ఏడు శాతం ఓట్లే ఆ పార్టీకి వచ్చాయి. కనీ ఈ సారి మాత్రం ఏకంగా 17శాతం ఓట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ లో వెల్లడయింది. ఏకంగా 9 శాతం ఓట్లు బీజేపీకి పెరుగుతాయి. ఇతర పార్టీలకు వచ్చే ఓట్ల శాతం ఈ సారి బాగా తగ్గిపోయింది. గత ఎన్నికల్లో ఇతరులకు 17.8 శాతం ఓట్లు రాగా ఈ సారి ఆ శాతం కేవలం 4.5 శాతానికి పడిపోతుందని తేలింది. మార్జినల్స్ ఇవ్వకుండా ఖచ్చితంగా సీట్ల ప్రొజెక్షన్ అంచనా వేయాలంటే.. హంగ్ వస్తుందని ఏబీపీ సీఓటర్ ఎగ్జిట్ పోల్ చెబుతుంది. అయితే కాంగ్రెస్ పార్టీ సాధారణ మెజార్టీకి చాలా దగ్గరగా వస్తుంది. కాంగ్రెస్ పార్టీకి 57 సీట్ల వరకూ వచ్చే అవకాశం ఉంది. గత ఎన్నికలతో పోలిస్తే 38 సీట్లు ఎక్కువ. బీఆర్ఎస్ పార్టీ 42 సీట్లను కోల్పోయి 46 దగ్గర స్థిరపడుతుంది. బీజేపీ ఒకటి నుంచి ఎనిమది స్థానాలకు పెరుగుతుంది. అదర్స్ కు ఏడు సీట్లే వస్తాయి. ఆ ఏడూ మజ్లిస్ కే వచ్చే చాన్స్ ఉంది. తెలంగాణ రాషట్ర సమితి ప్రభుత్వం పదేళ్లుగా అధికారంలో ఉంది. ఈ సందర్భంగా అధికార వ్యతిరేకత ఉందని ఎగ్జిట్ పోల్స్ లో వెల్లడయింది. ఈ అధికార వ్యతిరేకత తీవ్రంగా ఉంటే కాంగ్రెస్ పార్టీకి 67 నుంచి 79 సీట్ల వరకూ లభించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ పరిస్థితి 29 నుంచి 41 సీట్లకు పరిమితమవ్వొచ్చు. బీజేపీకి నాలుగు నుంచి ఎనిమిది సీట్లు, ఇతరులకు మూడు నుంచి ఏడు సీట్లు వరకూ వస్తాయి. అంటే అధికార వ్యతిరేకత బాగా ఉంటే.. కాంగ్రెస్ పార్టీకి ఊహించనంత మెజార్టీ వచ్చే అవకాశం ఉంది. తెలంగాణ ప్రభుత్వం తమకు ప్రజల్లో సానుకూలత ఉందని నమ్మకంతో ఉంది. ఎగ్జిట్ పోల్స్ లో అలాంటి వాతావరణ కనిపించకపోయినా.. ఓటర్లు చివరి క్షణంలో మనసు మార్చుకుని ఉంటే.. తెలంగాణలో బీఆర్ఎస్ సర్కార్ మరోసారి ఏర్పడుతుంది. కానీ.. అదీ అత్తెసరు మెజార్టీ లేదా హంగ్ ద్వారా మాత్రమే. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి 40 నుంచి 52 స్థానాలు వస్తాయి. బీఆర్ఎస్ పార్టీకి 54 నుంచి 66 స్థానాలు వస్తాయని అంచనా. బీజేపీకి ఏడు నుంచి 11 సీట్లు లభిస్తాయి. ఇదిలావుంటే తెలంగాణ ఎన్నికల ఎగ్జిట్ పోల్స్.. బీఆర్ఎస్ శ్రేణుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. ఏకంగా బీఆర్ఎస్ బాస్ సీఎం కేసీఆర్?కే ఓటమి తప్పదని ఆరా మస్తాన్ సర్వే వెల్లడించింది. కేసీఆర్ ఎంతో ప్రతిష్టాత్మతంగా తీసుకున్న కామారెడ్డి నియోజకవర్గంలో ఓటమి తప్పదని సర్వేలో వెల్లడైంది. అలాగే కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డి ఓడిపోయే అవకాశాలు ఉన్నాయని ఈ సర్వే వెల్లడించింది. ఇక్కడ బీజేపీ అభ్యర్థి వెంటకరమణా రెడ్డి గెలిచే అవకాశం ఉందని తెలిసింది. మరోవైపు గజ్వేల్‌లో కేసీఆర్ స్వల్ప మెజారిటీతో గెలుపొందుతారని ఆరా మస్తాన్ సర్వే సంస్థ తెలపడంతో బీఆర్ఎస్ పార్టీలో టెన్షన్ వాతావరణం నెలకొంది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 5 గంటలకు ముగిసింది. 119 నియోజకవర్గాలకు గాను మొత్తం 2,290 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పోటీ చేశారు. అయితే బర్రెలక్క భవితవ్యంపై ఎగ్జిట్ పోల్స్ ఏం చేప్తున్నాయి?. బర్రెలక్క గెలుస్తుందా అనే అంశంపై ఆరా మస్తాన్ సర్వే వివరాలను వెల్లడించింది. బర్రెలక్కకు 15 వేల ఓట్లు రావచ్చని ఆరా మస్తాన్ సర్వే పేర్కొంది. అయితే ఈమె గెలవకపోయినా గట్టి పోటీ ఇచ్చే ఛాన్స్ ఉందని స్పష్టం చేసింది. కాంగ్రెస్ అభ్యర్థి జూపల్లి కృష్ణారావు గెలిచే అవకాశం ఉందని ఆరా సర్వే వెల్లడించింది. కర్నె శిరీష అలియాస్ బర్రెలక్క పెద్దకొత్తపల్లి మండలం మరికల్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మర్రికల్ గ్రామంలోని బూత్ నెంబర్ 12లో ఆమె ఓటు వేశారు. హైకోర్టు ఆదేశాలతో బర్రెలక్కకు ఈసీ సెక్యూరిటీ కూడా ఇచ్చింది.

# ఎగ్జిట్ పోల్ అంచనాలు ట్రాష్

**ఎగ్జిట్ పోల్ అంచనాలు ట్రాష్**

**మళ్లీ అధికారం మాదే అన్న కెటిఆర్**

**హ్యాట్రిక్ కొట్టబోతున్నామని ధీమా**

**కొందరిని విచారించి ఫలితం ఇదని ఎలా చెబుతారని ప్రశ్న**

**డిసెంబర్ 3న అధికారం మాదే అని తేలుతుంది**

హైదరాబాద్,నవంబర్30 : ఎగ్జిట్ పోల్స్ అంచనాలు చూసి కంగారు పడాల్సిన పని లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ అధికారం బీఆర్ఎస్ పార్టీదేనని పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత తెలంగాణ భవన్ లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ' ఈరకమైన ఎగ్జిట్ పోల్స్‌ను గతంలోనూ చూశాం. ఎగ్జిట్ పోల్స్ తప్పు అని నిరూపించడం మాకు కొత్తేమీ కాదు. డిసెంబర్ 3న 70కి పైగా స్థానాలతో విజయం సాధిస్తాం. హ్యాట్రిక్ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎగ్జిట్ పోల్స్‌ను చూసి కంగారు పడాల్సిన అవసరం లేదు. కొన్ని మీడియా సంస్థలు సర్వేలు చేయకుండా.. ఏదో 200 మందిని అడిగినట్టు చేసి.. దాన్ని గొప్పగా చేసి చూపిస్తారు. గతంలో 5 మీడియా సంస్థలు సర్వేలు చేస్తే.. అందులో ఒక్కటే నిజమైంది.' అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజలు ఇంకా లైన్‌లో ఉండి ఓట్లు వేస్తూనే ఉన్నారని.. అప్పుడే ఎగ్జిట్ పోల్స్ వెల్లడించడటమేంటని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. అస్సలు ఏ లాజిక్‌తో ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్నారో అర్థం కావట్లేదని పేర్కొన్నారు. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తుందని అన్నారు. ఒకవేళ డిసెంబర్ 3న ఎగ్జిట్ పోల్స్ తప్పు అయితే.. తప్పు జరిగిందని తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెబుతారా? అని ఎగ్జిట్ పోల్స్ ప్రచురించిన మీడియా సంస్థలను కెటిఆర్ ప్రశ్నించారు. ఎవ్వరూ కన్ఫ్యూజన్ కావద్దని.. వందకు 100 శాతం అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు. గత 90 రోజులుగా కష్టపడ్డ మా కార్యకర్తలు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గంట, గంటన్నర సేపు పోలింగ్ జరిగేది ఉందని.. 70కి పైగా స్థానాల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆరే మళ్లీ ముఖ్యమంత్రి అవుతారని పేర్కొన్నారు. 70కి పైగా స్థానాల్లో గెలుస్తాం అని ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై మంత్రి కేటీఆర్ స్పందించారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, హ్యాట్రిక్ కొడతామని కేటీఆర్ తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ చూసి కంగారుపడాల్సిన అవసరం లేదని, ఎగ్జిట్ పోల్స్ తప్పయితే డిసెంబర్ 3 తర్వాత క్షమాపణలు చెబుతారా? అని కేటీఆర్ ప్రశ్నించారు.'మళ్లీ అధికారం మాదే.. హ్యాట్రిక్ కొడతాం. 2018 తెలంగాణ ఎగ్జిట్ పోల్స్ తప్పని తేలాయని మంత్రి కేటీఆర్ అన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా ప్రశాంతంగా పోలింగ్

సైలెంట్ పీరియడ్‌లో రాజకీయ నాయకులు మాట్లాడొద్దని చట్టం ఉందన్నారు. గుళ్లను, ప్రార్థనా మందిరాలను రాజకీయాల కోసం కాంగ్రెస్ నేతలు వాడుకున్నారని ఆరోపించారు. ఓటు వేసి ఓటర్లను ప్రలోభపెట్టేలాగా రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. రేవంత్ రెడ్డి ఎలక్షన్ కోడ్ ఉల్లంఘిస్తూ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్‌పై రేవంత్ వ్యాఖ్యలు చట్టాన్ని ఉల్లంఘించినట్లే అని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై సీఈఓ, ఈసీఐకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేటీఆర్ పేరుతో ఏ1 ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌తో తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కేటీఆర్ పేరుతో తప్పుడు ప్రచారం చేయబోతున్నామని డీజీపీకి ముందుగానే ఫిర్యాధు చేసామని.. తాము చేసిన గంటకే ఫేక్ వీడియో బయటకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో నేరాలు చేసే నాయకులు ఎక్కువగా ఉన్నారన్నారు. రేవంత్ రెడ్డికి తెలిసే ఫేక్ వీడియోలు బయటకు వచ్చాయని సోమా భరత్ ఆరోపించారు.


















# ప్రజాతీర్పును గౌరవించాలి !

ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసాయి. పోలింగ్ కూడా పూర్తి కావచ్చింది. ప్రజలు ఎవరికి అధికారం కట్టబెట్టాలో తీర్పునిచ్చారు. డిసెబర్ 3న తీర్పు వెల్లడి కానుంది. వారి తీర్పును గౌరవించి స్వాగతించాలి. ఇదే సమయంలో పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఐదు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు కొలువు తీరనున్నాయి. అలాగే వచ్చే మేలో సార్వత్రిక ఎన్నికలు జరుగబోతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికైనా పార్లమెంట్‌లో ప్రజాస్వామ్యయుతంగా చర్చలకు అవకాశం రావాలి. ప్రధానంగా కేంద్ర రాష్ట్రాల మధ్య సంబంధాలు పూర్తిగా దెబ్బ తిన్నాయి. కేంద్ర,రాష్ట్రాల్లో ఏ పార్టీ ప్రభుత్వాలు ఉన్నా ప్రజాస్వామ్యం దెబ్బతినరాదు. ప్రజల తీర్పును అపహాస్యం చేయరాదు. ప్రజలిచ్చిన తీర్పును గౌరవిస్తూ మోడీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాపాడడంతో పాటు సంబంధాలను బలపర్చాలి. కేంద్ర,రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థపై జరుగుతున్న దాడి, గవర్నర్ వ్యవస్థ ద్వారా కేంద్రం పెత్తనం చెలాయించేలా చేస్తున్న ప్రయత్నాల పై ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. ప్రాంతీయపార్టీలు ఇవే అంశాలపై ఆందోళన చెందుతున్నాయి. దీనిపై ఉమ్మడిగా పోరాడాలన్నప్రయత్నాలు వ్యక్తం అవుతున్నా సంఘటితం కాలేకపోతున్నాయి. ప్రాంతీయ పార్టీల మధ్య సంఘటితం కావాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా దక్షిణాది సిఎంలు ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంది. నిజానికి గవర్నర్ వ్యవస్థను కాంగ్రెస్ బాగా భ్రష్టు పట్టించింది. దీనిని రద్దు చేయాలన్న అభిప్రాయం ఉంది. రాజకీయపార్టీలు ముందుగా ఈ విషయంలో చర్చచేయాల్సి ఉంది. మన రాజ్యాంగ నిర్మాతలు కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాలుగా విభజించారు. పంచాయత్‌రాజ్ చట్టం ఆమోదించిన తర్వాత, స్థానిక స్వపరిపాలన సంస్థలకు హక్కులు ఇవ్వబడ్డాయి. వాటికి అధికారాలు కేటాయించబడ్డాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలి. గ్రామాల అభివృద్ధితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందుతుంది. దేశంలోని గ్రామాలు, రాష్ట్రాల అధికారాలను నిర్వీర్యం చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తున్న తీరు సరికాది. ఇది రాజ్యాంగానికి విరుద్ధం. కేంద్రం తరచూ రాజ్యాంగం నిర్వచించిన అధికార పరిధిని ఉల్లంఘిస్తోంది. కేంద్ర తన పరిధిని విస్తరించే క్రమంలో రాష్ట్రాల అధికారాలను ఆక్రమించాలని చూస్తోంది. ఇది కాంగ్రెస్ హయాంలోనూ జరిగింది. ఇప్పుడు మోడీ హయాంలో నిత్యం జరుగుతోంది. నిజానికి కేంద్ర, రాష్ట్ర సంబంధాలు బలహీనపడ్డాయి. అందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ ప్రభుత్వమే కారణమని చెప్పు కోవాలి. రాజ్యకాంక్ష విస్తరణతో రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారు. జాతీయ విధానాలను తుంగలో తొక్కారు. రాష్ట్రాలన్ని కలిస్తేనే దేశం అవుతుంది. అలాంటి రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోంది. ప్రతి దానికీ బిచ్చం ఎత్తుకునేలా పరిస్థితి తీసుకుని వచ్చారు. మరోవైపు బిజెపీయేతర రాష్ట్రాలపట్ల వివక్షత చూపుతోందని ఆయా రాష్ట్రాల సిఎంలు విమర్శిస్తున్నారు. రాష్ట్రాలు, స్థానిక సంస్థలను లొంగదీసుకునే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం అధికారాలను కేంద్రీకరించే ధోరణిని కలిగి ఉందని వారు ఆరోపిస్తున్నారు. బిజెపి అధికారంలోకి రాగానే, రాష్ట్రాల హక్కులను పునరుద్దరిస్తారని భావించారు. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంలో ప్రదాని మోడీ ఇదే చెప్పారు. కానీ అలా జరగడం లేదు. వాటి హక్కులకు భంగం కలిగించి, వాటి ఆర్థిక హక్కులను హరించే విధంగా జిఎస్‌టిని అమలు చేస్తోంది. పన్నుల వసూళ్లను కొల్లగొట్టారు. పరిహారం ఇస్తామని హామీ ఇచ్చినా పరిహారం ఇవ్వటం లేదు. అరకొర పరిహారం కూడా సకాలంలో ఇవ్వటం లేదు. కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వాలకి రావాల్సిన నిధులు కూడా విడుదల చేయడంలేదు. కీలకమైన అంశాలపై చర్చలు లేకుండా, రాష్ట్రాలతో సంప్రదింపులు చేయకుండానే చట్టాలు చేయడం, నిర్ణయాలు తీసుకోవడం జరుగుతోంది. ఇప్పటికైనా ఈ సంప్రదాయన్ని పక్కన పెట్టాలి.

రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని పార్లమెంట్ వేదికగా అన్ని అంశాలు చర్చించాలి. ముందు చర్చించడాని కి పూనుకోవాలి. పార్లమెంటులో సమస్యలపై చర్చించాలి. రాష్ట్రాలు లేవనెత్తే అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పార్లమెంటులో చట్టాలను ఎటువంటి చర్చ లేకుండా ఆమోదించుకుంటున్న తీరు గత పదేళ్లుగా చూస్తున్నాం. పార్లమెంటులో ప్రత్యేకమైన, అర్థవంతమైన చర్చలు లేకుండా ముగించేస్తున్నారు. పార్లమెంట్ సభ్యులు లేవనెత్తిన ఏ ప్రశ్నలకు సరైన సమాధానాలు రావడం లేదు. మోడీ ప్రభుత్వం ఎవరికీ జవాబు దారీతనం లేని విధంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం మెజారిటీ ఉన్నందున ప్రతి చర్యను నిర్మోహ మాటంగా అమలు చేస్తున్నది. ఈ చర్యలన్నీ ఒక్కో రాష్ట్రంలో గవర్నర్ కార్యాలయాన్ని ఉపయోగించి అమలు చేయవచ్చని భావిస్తున్నారు. రాష్ట్రంలో ఎన్నికైన మంత్రివర్గం ఉన్నప్పుడు, గవర్నర్ కార్యాలయం ద్వారా రాష్ట్రాన్ని పాలించాలని కోరడం రాజ్యాంగ విరుద్ధం. ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాల్లో రాజ్‌భవన్ ద్వారా సమాంతర ప్రభుత్వాన్ని నడపాలని చూస్తున్నారు. రాజ్యాంగం ఆర్థిక విషయాలలో యూనియన్‌కు ప్రాధాన్యత ఇచ్చింది. ఉమ్మడి జాబితాలోని విషయాల్లో కూడా రాష్ట్రాల కంటే యూనియన్‌కే ఎక్కువ పట్టు ఉంది. రాజ్యాంగంలో పేర్కొనని విషయాలపై కేంద్రం నిర్ణయం తీసుకోవచ్చు. మన సమాఖ్య నిర్మాణం ఏకీకృత పక్షపాతాన్ని కలిగి ఉంది. ఇది రాష్ట్రాలకు తీవ్రమైన పరిమితులను సృష్టించింది. రాష్ట్రాల హక్కులను కాపాడుకోవలసి ఉంది. కేంద్ర, రాష్ట్ర సంబంధాలను నిర్వీర్యం చేస్తున్న మోడీ ఇప్పటికైనా ప్రజాస్వ3ఆమ్య బద్దంగా ఎన్నికైన రాష్ట్రాలకు గౌరవం ఇవ్వాలి. అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లగలదు.

# కేంద్ర,రాష్ట్రాల సంబంధాల్లో అగాథం

- రాష్ట్రాల హక్కులను హరిస్తున్న మోడీ
- ఉమ్మడిగా పోరాడాలన్న సంకల్పంతో స్టాలిన్, పినరయ్

**చెన్నై,నవంబర్30 :** ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలపై బిజెపి ప్రభుత్వం కేంద్ర విచారణ సంస్థలను, గవర్నర్లను ప్రయోగించి, బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్న తీరును పరోక్షంగా సుప్రీం హెచ్చరించింది. గవర్నర్ల తీరును సుప్రీం పలు సందర్భాల్లో ఆక్షేపిస్తోంది. ఇటీవల తమిళనాడు గవర్నర్ తీరును సుప్రీం ఘాటుగానే తప్పుపట్టింది. రాష్ట్రాల హక్కులకు ఇబ్బంది కలిగించే ప్రయత్నాలను ఎదుర్కోవడానికి, అధిగమించడానికి, మనం పోరాడటానికి, ప్రతిఘటించడానికి రాష్ట్రాలు సమిష్టితో ముందుకు వెళ్లాలని తమిళనాడు సిఎం స్టాలిన్ ఇప్పటికే పిలుపు ఇచ్చారు. ఇందుకు ముందుగా దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఏకం కావాల్సి ఉందతన్నారు. అయితే తెలంగాణ సిఎం కెసిఆర్ గతంలో కేంద్రంపై యుద్ధం ప్రకటించినా తరవాత ఆయన వైఖరిలో మార్పు వచ్చింది. దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రుల సముదాయాన్ని ఏర్పాటు చేయాలని, రాష్ట్రాలకు మరిన్ని హక్కులు కల్పించేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కూడా స్టాలిన్ అభిప్రయపడ్డారు. ఇది జరగాలంటే రాజకీయాల హద్దులు దాటి ఐక్యంగా కలిసి రావాలని కూడా సూచించారు. ప్రస్తుత రాజకీయ వాతావరణం దృష్ట్యా, భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి రావడం, బంధం, ఐక్య ఫ్రంట్ ఏర్పాటు చేయడం చాలా ముఖ్యం. భావసారూప్యత కలిగిన రాజకీయ పార్టీలు కలిస్తేనే విజయం సాధ్యమవుతుంది. ఈ విజయమే ఈ దేశానికి, సామాజిక న్యాయం, సమానత్వం, లౌకికవాద ఆదర్శాలకు భరోసానిస్తుంది. అటువంటి విజయాన్ని సాధించేందుకు ప్రతిపక్షం చర్యలు చొరవ చూపుతుందా అన్నది చూడాలి. కమ్యూనిస్ట్ పార్టీ అన్ని సమయాలలో కేంద్ర, రాష్ట్ర సంబంధాల సమస్యను తీవ్రంగా తీసుకుని పోరాడుతోందని కేరళ సిఎం పినరయి విజయన్ అన్నారు. గతంలో కాంగ్రెస్ అవలంబించిన్న విధానాలను బిజెపి దూకుడుగా కొనసాగిస్తోందన్నారు. కేంద్రం-రాష్ట్ర సంబంధాలను ప్రజాస్వామ్యకరించడం వారి ఎజెండాలో లేదని మండిపడ్డారు. వారి ప్రతి చర్య కేంద్రం-రాష్ట్ర సంబంధాలను మరింత దిగజార్చిందని కేరళ సిఎం పినరయ్ విజయన్ విమర్శించారు. రాష్ట్రాలకు హక్కుగా ఉన్న వాటి కోసం పోరాడేందుకు కాంగ్రెస్ సిద్ధంగా లేదన్నారు. కేరళ విషయానికి వస్తే, యుడిఎఫ్ ఎంపిలు కేరళ అభివృద్ధికి సంబంధించిన ఏ ఒక్క అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తడానికి మొగ్గు చూపడం లేదు. కేంద్రం-రాష్ట్ర సంబంధాలను ప్రజాస్వామ్యీకరించడం చాలా అవసరం అన్నారు. తద్వారా రాష్ట్రాల హక్కులు రక్షించబడతాయి. దేశం ఐక్యత, సమగ్రతను కాపాడేలా చూసుకోవాలి. దీన్ని పరిగణనలోకి తీసుకునే జోక్యాలు ఇప్పుడు దేశానికి అవసరం. భిన్నత్వం లో ఏకత్వమే మనబలం అని వివరించారు. సమాఖ్య వ్యవస్థను ధ్వంసం చేశారని విమర్శించారు. దేశంలోని రాష్ట్రాలహక్కులు కాలరాయబడుతున్నాయని విమర్శించారు. హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలు ఫెడరల్ పాలిటీ కోసం ముందుకు వచ్చినప్పటికీ, దేశం పాక్షిక సమాఖ్య దేశంగా ఏర్పాటు చేయబడింది. ఈ విషయంలో, రాష్ట్రాలస్వయం ప్రతిపత్తిపై దేశ ఐక్యత ఊపందుకున్న భావోద్వేగ పరిస్థితులను దేశ విభజన ఎలా సృష్టించిందనే దానిపై పరిశీలను చేశారు. 1959లో సభలో మెజారిటీ ఉన్నప్పటికీ కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతో మన కేంద్ర-రాష్ట్ర సంబంధాల అప్రజాస్వామిక స్వభావం తెరపైకి వచ్చిందని వివరించారు. యుపిఎ 1లో వామపక్షాలు ప్రవేశపెట్టిన ఉమ్మడి కనీస కార్యక్రమంలో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడానికి కొన్ని సిఫార్సులు చేశాం. రాష్ట్రాల రుణ భారాన్ని తగ్గించడం, వారి రుణాలపై వడ్డీని తగ్గించడం, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను పెంచడం వంటివి ఇందులో ఉన్నాయి. అయితే, ఈ సిఫార్సులు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ సిఫార్సులు 2007లో ఏర్పాటైన పుంఛీ కమిషన్ నిబంధనలలో కూడా లేవు. కేరళలోని అప్పటి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం కూడా ప్రత్యేకించి ఆర్థిక విషయాలు, రాష్ట్రాలకు సంబంధించి కొన్ని సిఫార్సులను కమిషన్‌కు సమర్పించింది. కానీ రాష్ట్రానికి సంబంధించిన లా అండ్ ఆర్డర్‌ను పరిశీలించడం ద్వారా రాష్ట్రాల అధికారాలను మరింత పరిమితం చేయాలని, కేంద్ర సహాయా నికి సంబంధించి రాష్ట్రాలకు మరిన్ని షరతులు విధించాలని కోరిందని పినరయ్ తెలిపారు.

## భాషోద్యమానికి అక్షరదీపిక

### ఆధునిక కవి గురజాడ వర్ధంతి

**విజయనగరం,నవంబర్30 :** తెలుగుభాషకు అక్షరాలు దిద్దిన మహాకవి గురజాడ. భాషోద్యమానికి తనవంతుగా ఆయన చేసిన కృషి అనన్య సామాన్యం.రాజు నుంచి రోజు కూలీ దాకా సమకాలీనులను అమితంగా ప్రభావితం చేసిన నవయుగ వైతాళికుడు. స్త్రీలను తొక్కిపెట్టే నాటి శిథిల సమాజంపై 'కన్యాశుల్కం' నాటకంతో అగ్నివర్షం కురిపించిన కలం యోధుడు గురజాడ. అలాగే సామాజిక రుగ్మతలపై యుద్ధం చేశాడు. తన రచనలతో మార్పుకు తీవ్రంగా ప్రయత్నించాడు. తెలుగు భాషా సాహిత్యాలను, సామాజిక చైతన్యాన్ని ముందంజ వేయించిన సంస్కర్త-మహాకవి గురజాడ అప్పారావు. కేవలం 52 సంవత్సరాల జీవితంలోనే అనల్పమైన దార్శనికతతో కాలాన్ని ముందుకు నడిపిన ప్రతిభామూర్తి. దేశభక్తి, ఆధునిక కవిత్వం, ప్రేమ, స్త్రీ సంస్కరణ సంఘ చైతన్యం వంటివెన్నో ఉదాత్త వినూత్న భావాలను నిర్వచించి, నిర్వహించిన భాషోద్యమ నేత గురజాడ. 1915 నవంబర్ 30న కన్నుమూసినా.. తెలుగుజాతి హృదయాల్లో శాశ్వతంగా జీవిస్తున్న ధన్యుడు గురజాడ. మరణించిన తర్వాతే జీవించడం మొదలు పెట్టాడు. సృజనాత్మకత-సాహిత్య భాషగా వాడుక భాషకై తపించిన గురజాడ సర్వ ప్రపంచ దేశాలు తమ దేశగేయంగా పాడుకొనే స్థాయిలో 'దేశమును ప్రేమించుమన్న' అంటూ దేశభక్తి గేయం రాశారు.1892 లోనే కన్యాశుల్కం, 1906లో కొండుభట్టీయం-రాసినా వ్యవహారిక భాషోద్యమంకై బలమైన పోరాటం చేశారు. సాంప్రదాయ వాదుల్ని మట్టికరిపించాడు. భిన్న కులాల సహపంక్తి భోజనం పెట్టించడం-కన్యల బాల్య వివాహాలపై పూర్ణమ్మ గేయాలతో కన్నీరు పెట్టించాడు. ఆధునిక కథకు 'దిద్దుబాటు' జరిపి సుభద్ర లాంటి పద్యకావ్యం రాయగలను అన్న భాషాశాస్త్రవేత్త గురజాడ. మంచి అన్నది మాల అయితే, మాలనేనగుదున్' అని సామాజిక సంస్కరణకు గొంతిచ్చాడు. కరుడుకట్టిన గ్రాంథిక భాషావాదులకు సవాల్ విసిరిన భాషోద్యమ గీతికగా నిలిచారు. వాడుక భాష కోసం గిడుగు రామ్మూర్తి నీడలో పోరాడిన మహా యోధుడు గురజాడ. దార్శినిక అక్షర యోధుడు గురజాడ అప్పారావు. ఆయన వర్ధంతి సందర్భంగా నివాళిగా..




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

**' ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...**

**-ఎడిటర్**

# చమురు ధరలతో ఆర్థికంగా దెబ్బ



**చమురు ధరలతో ఆర్థికంగా దెబ్బ**

**తగ్గిపోతున్న ప్రజల కొనుగోలు శక్తి**

**పన్నుల భారం తగ్గిస్తేనే వెసలుబాటు**

న్యూఢిల్లీ,నవంబర్30 : ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగా చమురు, సహజవాయువుల ధరలు పెరిగాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడింది. తరవాత ఇజ్రాయిల్ యుద్ధం కూడా ఇదే పరిస్థితిలోకి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పరిణామాల కారణంగా ధరల దాడి తప్పడం లేదు. ప్రధానంగా ఆయిల్, నూనెల ధరలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పెట్రో,గ్యాస్ ధరలు మున్ముందు మరింతగా పెరిగే అవకాశాలు లేవని చెప్పలేం. మంచినూనెల సరఫరా కూడా దెబ్బ తినే అవకాశం ఉన్నందున ఇప్పటికే పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్, సోయా నూనె, వనస్పతి ధరలు కూడా పెరగడం మొదలెట్టాయి. మనదేశ చమురు ఉత్పత్తుల వినియోగంలో 85 శాతం దిగుమతులపై ఆధారపడి జరుగుతుంది. గతేడాది కరోనా వలన, ఇతర కారణాల వలన చమురు ఉత్పత్తుల వినియోగం తగ్గింది. కాని పెరిగిన ధరల వలన వాటికి వెచ్చించే మొత్తం మాత్రం పెరిగింది. ధర పెరిగినంత మాత్రాన పెట్రోలు, డీజెల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించలేము. కనుక వాటికోసం మనం వెచ్చించే మొత్తం పెరిగింది. ఐతే కార్మికుల, ఉద్యోగుల వేతనాలు మొత్తం మీద పెరగలేదు. దీంతో మనం ఇతర వస్తువుల వినియోగాన్ని తగ్గించి వేస్తున్నాం. ఇతర సరుకుల వినియోగం ఎప్పుడైతే తగ్గిందో, ఆ మేరకు ఆయా రంగాలలో మాంద్యం ఏర్పడుతుంది. దీనిని నివారించడానికి ప్రభుత్వం పూనుకోవాలి. కాని అలా జరగడం లేదు.పెట్రో ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడల్లా వాటిమీద వసూలు చేసే పన్నుల మొత్తం కూడా పెరుగుతోంది. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పెట్రో ధరల పెరుగుదల వలన అదనపు ఆదాయం సమకూరుతోంది. ఆవిధంగా వచ్చిన అదనపు ఆదాయాన్ని ఉపాధి కల్పన వంటి రంగాలకు ఖర్చు చేయడం బదులు, కార్పొరేట్లకు మరిన్ని రాయితీల్విడానికో, వారి బకాయిలను మాఫీ చేయడానికో వినియోగిస్తోంది. వాస్తవానికి మన దేశంలో పెట్రోలు ధరలో 45.5 శాతం, డీజిల్ ధరలో 39.8 శాతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులకే పోతుంది. పన్ను రూపంలో వసూలు చేసేదానిలో కేంద్రం రాష్ట్రాలతో భాగం పంచుకోవాలి. అందుచేత మోడీ ప్రభుత్వం నేరుగా పన్ను రూపంలో కాకుండా స్పెషల్ డ్యూటీ, రోడ్ సెస్, ఇన్‌ఫ్రాస్టక్చ్రర్ సెస్ వంటి పేర్లతో వసూలు చేస్తోంది. తరచూ ఆర్థిక మాంద్యం ఏర్పడడం వల్ల సరుకుల వినిమయం తగ్గిపోతుంది. అదే విధంగా ద్రవ్యోల్బణం పెరుగుతూవుంటుంది. మన రూపాయి విలువ పడిపోయినా, సరుకుల ధరలు పెరిగినా అది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దేశంలో ప్రస్తుతం నిరుద్యోగం 8 శాతం దాటింది. టోకు ధరల సూచి జనవరి 2021తో పోల్చితే జనవరి 2022 నాటికి 13 శాతాన్ని దాటింది. వీటికి తోడు మన దేశ వార్షిక జిడిపి వృద్ధి రేటు ముందు అంచనా వేసినట్టు 9.2 శాతం కాకుండా 8.9 శాతమే ఉండబోతుందని తాజా అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఒమిక్రాన్, ఉక్రెయిన్ యుద్ధం ఆర్థిక వ్యవస్థమీద ప్రభావం చూపనున్నాయని అంటున్నారు. వృద్ధిరేటు తక్కువగా ఉండడం, ద్రవ్యోల్బణం అధికంగా ఉండడం, నిరుద్యోగం తీవ్రంగా ఉండడం నేటి ఆర్థి దుస్థితికి తాజాఉదాహరణాలు. ద్రవ్యోల్బణం కారణంగా నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. ఐతే మార్కెట్లమీద గుత్తాధిపత్యం కలిగివున్న బడా కార్పొరేట్లు ఆ పెరిగిన ధరలను వినియోగదారులమీదకు నెట్టివేస్తున్నారు. ఇకపోతే పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడం వలన దాని ప్రభావం రవాణా రంగం మీద పడుతుంది. దాని కారణంగా ఇతర సరుకుల ధరలు కూడా పెరుగుతాయి. ఇవన్నీ కలిసి ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దీని పర్యవసానంగా శ్రామిక ప్రజల కొనుగోలుశక్తి తగ్గిపోతుంది. దానివలన సరుకుల వినియోగం తగ్గిపోతుంది. మార్కెట్ లోని సరుకులు చెల్లుబాటు కావు. అందువలన ఆర్థిక మాంద్యం ఏర్పడుతుంది. ప్రస్తుత సంక్షోభాన్ని నివారించాలంటే ప్రజల కొనుగోలుశక్తిని పెంచే మార్గాలు అన్వేషించాలి. ఉపాధికల్పన మార్గాలను అన్వేషించాలి. కనీసం పెట్రో ఉత్పత్తుల మీద పన్నులను పెంచడం తగ్గిస్తే ప్రజల కొనుగోలుశక్తి పెరుగుతుంది. కేంద్ర రాష్ట్రాలు విధిస్తున్న సెస్సులను తగ్గిస్తే అనేక సమస్యలకు సమాధానం లభిస్తుంది.

# కడప దర్గాను సందర్శించిన సిఎం జగన్

**దర్గాలో జగన్ ప్రత్యేక ప్రార్థనలు**

**ప్రభుత్వ ఆధ్వర్యంలో ఛాదర్ సమర్పణ**

కడప,నవంబర్30(ఆర్ఎన్ఎ): మత సామరస్యానికి ప్రతీకగా, మహిమాన్విత సూఫీగా వెలుగొందుతున్న.. అమీన్ పీర్ దర్గా ను సందర్శించడంతో తన జన్మ చరితార్థం అయ్యిందని, ఇది అదృష్టంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. గురువారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. కడప అమీన్ పీర్ (పెద్ద దర్గా) దర్గాను సందర్శించి.. ప్రభుత్వ లాంఛనాలతో పూల చద్దార్ సమర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు.. జిల్లా ఇన్చార్జి మంత్రి ఆది మూల సురేష్,రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి.అంజాద్ బాషా, కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీనాథ్ రెడ్డి, నగర మేయర్ సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు, జాయింట్ కలెక్టర్ గణెశిష్ కుమార్, కడప నగర పాలక కమిషనర్ జి.ఎస్.ఎస్. ప్రవీణ్ చంద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ... 'మత సామరస్యానికి ప్రతీక అయిన కడప అమీన్ పీర్ దర్గాను సందర్శించడం నా అదృష్టంగా భావిస్తున్నాను' అని ఆనంద పరవశులయ్యారు. ఈ దర్గా ఖ్యాతీ, మహిమలు.. ప్రపంచ వ్యాప్తంగా పరిమళిస్తున్నాయంటే.. కులమత తేడాలు లేకుండా ప్రజలంతా ఐక్యంగా భాగస్వామ్యం కావడమే ప్రధాన కారణం అన్నారు. తాను పుట్టిన సొంత జిల్లాలో.. ఇలాంటి మహత్తరమైన, మహిమాన్వితమైన దర్గా ఉండడం అదృష్టంగా భవిస్తున్నామన్నారు. అంతకు మించి అమీన్ పీర్ దర్గాను అత్యంత భక్తిశ్రద్ధలతో ఆధారిస్తున్న జిల్లా ప్రజలు ఎంతో అదృష్టవంతులన్నారు. ఆ భగవంతుడి ఆశీస్సులతో.. అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలు అందివ్వగలుగుతున్నామన్నారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పటిష్ఠంగా అమలు చేస్తూ.. మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా, రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా మైనారిటీ ప్రజల సేవలో తరిస్తున్న.. మిత్రుడు ఎస్.బి.అంజాద్ బాషాకు అభినందనలు తెలుపుకుంటున్నామన్నారు. మధ్యాహ్నం కడప విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన అమీన్ పీర్ దర్గా ప్రాంగణానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దర్గా ప్రతినిధులు దర్గా సంప్రదాయ లాంఛనాలతో ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా పెద్ద దర్గా ప్రధాన మందిరంలోకి ముఖ్యమంత్రిని సాదరంగా పీఠాధిపతి హరిఫుల్లా హుస్సేని,దర్గా కమిటీ సభ్యులు ఆహ్వానించారు. అనంతరం దర్గా సేవలో నిరంతరం పునీతులవుతున్న.. దర్గా ముజావర్లు,దర్గా కమిటీ సభ్యులను,చౌదరీ కలీఫాలను.. దర్గా పీఠాధిపతులు హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ముఖ్యమంత్రికి పరిచయం చేశారు.అనంతరం దర్గా పీఠాధిపతుల వారిచే 'సూఫీ సర్మాస్త్ సానీ షిలాక్' సంప్రదాయం ప్రకారం ముఖ్యమంత్రికి తలపాగా (పేటా) అలంకరణ చేసి, మెడలో షేలా (కండువా), ఇలాచి (దండ) దరింపజేయడం జరిగింది. తర్వాత పీఠాధిపతులతో కలిసి ముఖ్యమంత్రి అమీన్ పీర్ దర్గా గుమ్మం ముందుకు చేరుకుని.. అక్కడి నారికేళీ రాతిపై కొబ్బరికాయ కొట్టి స్వామివారికి సమర్పించుకున్నారు. అనంతరం ముజావర్లు... పూలు, వస్త్ర చాదర్, సుగంధ పరిమళాల అత్తరుతో కూడిన తట్టను ముఖ్యమంత్రికి అందజేయగా.. ఆయన తలపై పెట్టుకుని భక్తి పరవశ్యమైన మనస్సుతో ప్రధాన దర్గాలో పలికి ప్రవేశించారు. అక్కడ పీరుల్లా మాలిక్ జీవ సమాధి వద్ద గుడ్డ చద్దార్, పూలమాల, అత్తరు సమర్పించిన అనంతరం వారు ఫాతెహా నిర్వహించి ప్రార్థనలు చేశారు.అక్కడి నుండి నేరుగా అరీఫుల్లా మాలిక్, అమీన్ స్వామి మొదలైన 16 మంది పూర్వపు పీఠాధిపతుల మజార్ల వద్దకు చేరుకుని గంధం, గుడ్డ చాదర్, పూలు సమర్పించారు. అనంతరం.. అక్కడ ఉన్న పూర్వ పీఠాధిపతుల మజార్లకు పూలు సమర్పించి గురువులచే ప్రార్థనలు చేయించారు.అక్కడి నుండి అమీన్ పీర్ దర్గా గ్రంథాలయం చేరుకున్న ముఖ్యమంత్రికి.. పీఠాధిపతుల వారు దర్గా విశిష్టత, ప్రాశస్త్యాన్ని, చారిత్రక వైభవాన్ని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆధ్వర్యంలో అమీన్ పీర్ దర్గా ప్రాంగణం అంతా.. గట్టి పోలీసు భద్రతా ఏర్పాట్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో.. బద్వేల్ ఆర్డీవో వెంకట రమణ,డీఎస్పీ షరీఫ్,దర్గా మేనేజర్ ఎస్ఎండీ అలీఖాన్, ముజావర్ అమీర్, దర్గా కో ఆర్డినేటర్ కుతుబుద్దీన్, హజ్ హౌస్ చైర్మన్ గౌసుల్లాజం,ఉర్దూ అకాడెమీ ఛైర్మెన్ నదీమ్,వేర్ హౌస్ ఛైర్మెన్ కరీముల్లా , అహమ్మద్,స్టేట్ మైనారిటీ కమిషన్ మెంబర్ హిదియతుల్లా, నాయకులు అహమ్మద్ భాష,షేక్ ఉమెర్,సయ్యద్ జైద్, డా.సోహేల్,అఫ్జల్ ఖాన్,స్థానిక,రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





prajamantalau daily pages (01-12)_times of varha main (13-2).qxd 12/1/2023 8:59 AM Page 4





జగిత్యాల మండల అంతర్గామ గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న జగిత్యాల నియోజకవర్గ బిఆర్ఎస్ అభ్యర్థి డా. సంజయ్ కుమార్, రాధిక దంపతులు మరియు మాజీమంత్రి జీ. రాజేశం గౌడ్.



జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి జిల్లా కేంద్రం లోని శ్రీ కాసుగంటి నారాయణరావు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.



జగిత్యాల పట్టణం లోని పురాణిపేట హైస్కూల్ లో ఓటు హక్కు వినియోగించుకొన్న ఎమ్మెల్సీ ఎల్. రమణ కుటుంబ సభ్యులు



జగిత్యాల జిల్లా మెట్ పల్లి లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, బిఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్



**జగిత్యాల పట్టణంలో గోవిందుపల్లే గౌతమ హైస్కూల్ లో మొట్టమొదటి సారిగా ఓటుహక్కు వినియోగించుకున్న గోవిందుపల్లె కు చెందిన యువతి బొలుసాని సాయిశ్రీమ**



జగిత్యాల జిల్లా ధరూర్ క్యాంప్ జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ పోలింగ్ స్టేషన్ 177 లో ఓటు వేసిన జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత. లు



హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ కవిత



జగిత్యాల పట్టణం లోని పురాణిపేట హైస్కూల్ లో తన ఓటు హక్కు వినియోగించుకొన్న బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి భోగ శ్రావణి



సిద్దిపేట జిల్లా చింతమడక గ్రామంలో తమ ఓటు హక్కును వినియోగించుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్ శోభారాణి దంపతులు




కరీంనగర్ లోని జ్యోతి నగర్ లోని పోలింగ్ కేంద్రంలో తమ ఓటు హక్కు వినియోగించుకున్న, ఎంపి, బిజేపి అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్ కుటుంబ సభ్యులు




హైదరాబాద్ లో తన ఓటు హక్కు వినియోగించుకున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ఐఏఎస్



జగిత్యాల మండలం పొలాసలో పీఎస్ 116 పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వీల్ చైర్ ద్వారా పోలింగ్ కేంద్రానికి వెళ్లి వినియోగించుకున్న శతాధిక వృద్ధురాలు " గోసంగారి రుక్కమ్మ" .



ఓటు కోసం సౌదీ నుండి బుధవారం రాత్రి స్వగ్రామం వచ్చిన బుగ్గారం గ్రామానికి చెందిన అడ్లూరి లక్ష్మన్ కుమార్ వీరాభిమాని, గల్ఫ్ కార్మికుడు భారతపు మహేష్

## జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

### పటిష్ట బందోబస్తు మధ్య ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్ కి తరలింపు



**జగిత్యాల నవంబర్ 30 (ప్రజామంటలు):** జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ ముగిసింది అని ఎలాంటి సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ 3000 మంది పోలీస్, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది అని ఎస్పీ అన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవిఎంలను పట్టిష్ట బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్ నుంచి స్ట్రాంగ్ రూమ్ అయిన విఆర్కే కాలేజీకి తరలించడం జరిగిందని అన్నారు. కేంద్ర బలగాలు బిఎస్ఎఫ్ రాష్ట్ర సాయుధ బలగాలు, మరియు సివిల్ పోలీసు అధికారులు, సిబ్బందితో స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాటు చేసామన్నారు.

## ఎన్నికల విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక అభినందనలు

### స్కై ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్. వై. సంజీవ కుమార్



**పద్మారావునగర్ నవంబర్ 30 (ప్రజామంటలు):** భారత పౌరులుగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వేయడం ఖచ్చితమైన ప్రాథమిక హక్కుతో ఉన్న బాధ్యత. ఎన్నికల అధికారులు ప్రతి విషయంలో ఓపికగా, అన్ని రకాల జాగ్రత్తలు, చర్యలు తీసుకోని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకపాత్ర వహించారని స్కై ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్. వై. సంజీవ కుమార్ అభినందించారు. ఈ ఓట్ల పండుగను విజయవంతం చేయడానికి అహర్నిశలు అలుపెరుగని శ్రమతో విధులు నిర్వహించిన ఎన్నికల అధికారులు, పోలీస్ శాఖ, ప్రభుత్వ ఉన్నత అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

prajamantalau daily pages (01-12)_times of varha main (13-2).qxd 12/1/2023 8:59 AM Page 5



# ప్రశాంతంగా ముగిసిన హుజురాబాద్ ఎన్నికలు

## ఓటు వేసిన కౌశిక్ రెడ్డి, ఈటెల రాజేందర్, ప్రణవ్ బాబులు





**హుజురాబాద్ నవంబర్ 30 (ప్రజామంటలు):** హుజురాబాద్ శాసనసభ నియోజకవర్గానికి గురువారం జరిగిన ఎన్నికల్లో ప్రశాంతంగా జరిగినట్లు రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గం లో 305 పోలింగ్ బూత్ లు ఉండగా సాయంత్రం ఐదు గంటల వరకు 70. 23% పోలింగ్ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. కాగా సాయంత్రం 5 గంటల వరకు లైన్ లో ఉన్న వారికి ఓటు వేయడానికి అధికారుల అవకాశం ఇవ్వడంతో రాత్రి ఆరున్నర వరకు కూడా పోలింగ్ జరుగుతూనే ఉంది. హుజురాబాద్ నియోజకవర్గం లో మొదటి రెండు గంటల వరకు కేవలం 5. 63 % పోలింగ్ జరిగింది. ఉ:11గంటల వరకు 18.03% పోలింగ్ నమోదయింది మధ్యాహ్నం ఒంటిగంట వరకు 41.40% పోలింగ్ జరగగా మూడు గంటల వరకు 55.71% పోలింగ్ జరగగా సాయంత్రం 5 గంటల వరకు 70. 23 శాతం జరిగినట్లు అధికారులు తెలిపారు. కాగా పోలింగ్ సమయం ముగిసే వరకు పోలింగ్ బూతులలో వందలాది మంది ఉండడంతో అధికారులు వారికి ఓటు వేయడానికి అవకాశం ఇచ్చారు. దీంతో రెండు సుమారు రెండు గంటల పాటు పోలింగ్ జరిగా అవకాశం కనబడుతుంది. సాయంత్రం జరిగే ఓటింగ్ వల్ల పోలింగ్ శాతం పెరగడమే కాకుండా అభ్యర్థుల గెలుపోవటములపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. హుజురాబాద్ నియోజకవర్గం లో పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు అధికారులు తెలిపినారు. హుజురాబాద్ నియోజకవర్గం లోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్ మరియు ఇల్లంతకుంట మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పోలీసు వర్గాలు తెలిపాయి.

### ఓటు వేసిన ప్రముఖులు:

హుజురాబాద్ నియోజకవర్గంలో గురువారం జరిగిన ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కులు వినియోగించు కున్నారు. వీణవంక మండల కేంద్రంలో టిఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి, హిమ్మత్ నగర్ గ్రామంలో తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, సింగాపూర్ గ్రామంలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణవ్ బాబు మరియు హుస్నాబాద్ నియోజకవర్గ టిఆర్ఎస్ అభ్యర్థి వి సతీష్ బాబు అలాగే కమలాపూర్ మండల కేంద్రంలో హుజురాబాద్ నియోజకవర్గ బిజెపి అభ్యర్థి ఈటెల రాజేందర్, హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వాకులాభరణం కృష్ణమోహన్ రావు లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా హుజురాబాద్ నియోజకవర్గం లో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు హుజురాబాద్ లోని బాలికల ఉన్నత పాఠశాలను మోడల్ పోలింగ్ స్టేషన్ గా అందంగా రూపొందించారు. చాలామంది ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ముందు ఫోటోలు దిగే తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# సనత్ నగర్‌లో బీజేపీ గెలుపు ఖాయమైపోయింది

## రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయం
## ఓటర్లలో చైతన్యమే దానికి తార్కాణం



**సనత్ నగర్ నవంబర్ 30 (ప్రజామంటలు):** సనత్ నగర్ లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి విజయం సాధించడం ఖాయమని సికింద్రాబాద్ పార్లమెంటరీ బీజేపీ ఇంచార్జ్ తడిసిన రాజశేఖర్ రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ వై. శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం పోలింగ్ ముగిసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పోలింగ్‌స్టేషన్‌లో సమయం అయ్యేంత వరకు ఓటర్లు ఇంకా పోలింగ్ కేంద్రాలకు వస్తుండటం జనాల్లో వచ్చిన చైతన్యానికి నిదర్శనమన్నారు. సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ సమయం ముగిసిపోవడంతో చాలా మంది పోలింగ్ కేంద్రాల వరకు వచ్చి వెనుదిరిగిపోయారన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో పూర్తిగా విశ్వాసం పోయిందన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఒక బీసీని సీఎం చేస్తానని చెప్పిన బీజేపీని ప్రజలు పూర్తిగా నమ్మారని తెలిపారు. యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ రోడ్ షో సనత్ నగర్ లో పూర్తిగా సక్సెస్ అయిందన్నారు. దళిత ఉద్యమ కారులు మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతు ఇవ్వడం లాంటి అంశాలను చూస్తుంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. ఈనేపథ్యంలో సనత్ నగర్ లో బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి, మాజీ సీఎం చెన్నారెడ్డి తనయుడు శశిధర్ రెడ్డి గెలుపు ఖాయం అని అన్నారు.

# నేడు ఉ. 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరనున్న

## సికిరి తిరుపతి మృతదేహం
## ఎన్నారై సెల్ కన్వీనర్ టిపిసిసి షేక్ చాంద్ పాషా





**జగిత్యాల నవంబర్ 30 (ప్రజామంటలు):** నేడు ఉ. 9 గంటలకు శంషాబాద్ ఎయిర్పోర్టుకు సికిరి తిరుపతి మృతదేహం మస్కట్ నుంచి స్వదేశానికి వస్తుంది. బాధిత కుటుంబాలు సమాచారం మస్కట్ నుంచి సంజీవ్ ఫోర్ మెన్ ఎప్పటికప్పుడు సమాచారం అందించడం వల్ల మృతదేహాన్ని స్వదేశానికి రప్పించడానికి కంపెనీ యాజమాన్యం కంపెనీ తోటి మిత్రులు ఎంతో సహకరించారు తిరుపతి మృతి ఆక్సిడెంట్ అయిన తీరు చూసి సీసీ కెమెరాలు దృశ్యాలు ఒమాన్ దేశాన్ని కన్నీళ్లు పెట్టెలా ఉన్నాయి. ట్రాఫిక్ వేగంతో ఢీకొట్టగా మరో బస్సు ఎదురుగా వచ్చి ఢీ కొట్టి 200 మీటర్లు దూరం పోయింది. సంతోష్ ఫోన్ చేసి హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయిందని ఎయిర్ పోర్ట్ కి బయలుదేరిందని చెప్పగా ఫ్లైట్ నెంబర్ ఏర్ ఇండియా 560 ఒమాన్ టు ఢిల్లీ, ఢిల్లీ టు హైదరాబాద్ ఉదయం 9:30 గంటలకు వస్తుంది అంబులెన్స్ కొరకు ఎన్నారై సెల్ కన్వీనర్ టిపిసిసి షేక్ చాంద్ పాషా, ఎన్ఆర్ఐ సెల్ సెక్షన్ ఆఫీసర్ చిట్టి బాబుకు ఫోన్ ద్వారా సమాచారం అందించి ముఖ్యమంత్రి కి లేఖ రాశాను. ఉచితంగా అంబులెన్స్ ని ఎన్నారై సెల్ ఆఫీసర్ గారు అరేంజ్ చేసారు. మృతదేహం తీసుకురావడానికి ఎయిర్పోర్ట్ కు తమ్ముడు ఆంజనేయులు షేక్ చాంద్ పాషా గురువారం రాత్రి బయలుదేరారు. కుటుంబాలను ఆదుకోవాలని ముఖ్యమంత్రి ఎన్నారై నిధి నుంచి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని అలాగే వారికి కుటుంబానికి, గ్రామస్తులు, సామాజికవేత్తలు సహాయం చేయాలని షేక్ చాంద్ పాషా కోరారు.

# స్ట్రాంగ్ రూమ్ సెంటర్ వద్ద భద్రత ఏర్పాట్లు పరిశీలించిన జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపీఎస్



**జగిత్యాల నవంబర్ 30 (ప్రజామంటలు):** విఆర్కె ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్స్ మరియు స్ట్రాంగ్ రూమ్ ల యొక్క భద్రత పరమైన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ స్వయంగా పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలైన ఈవీఎం ల భద్రతకై నియోజకవర్గాల వారిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు మరియు కౌంటింగ్ హాలులవద్ద పూర్తిస్థాయిలో అవసరమయిన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసామని తెలిపారు.వీటి భద్రతకై కేంద్ర సాయుధ బలగాలని కేటాయించామన్నారు. విధుల్లో ఉన్న అధికారులకు తగు సూచనలు చేసారు. ఎటువంటి లోపాలు లేకుండా పూర్తి స్థాయిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని కౌంటింగ్ ముగిసే వరకు ఎటువంటి భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు.

# తెలంగాణ ప్రజలు మార్పు కోసం చూస్తున్నారు

## నాతో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఓటు ఎక్కడుందో చెప్పాలి
## హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్



**హుస్నాబాద్ నవంబర్ 30 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రజలు రాష్ట్రంలో మార్పు కోరుకుంటున్నారని, టిఆర్ఎస్ ప్రభుత్వానికి గద్దె దించాలని చూస్తున్నారని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సిపిఐ పార్టీ బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తన సతీమణి మంజుల తో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాయ మాటలు చెప్పి ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు చేసింది శూన్యం అని అన్నారు. టిఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు ప్రభుత్వాన్ని మార్చాలని నిర్ణయించుకున్నా రన్నారు. తనతో పాటు పోటీలో ఉన్న అభ్యర్థుల ఓటు ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. బి ఆర్ ఎస్ ఎమ్మెల్యే పాలనతో హుస్నాబాద్ నియోజకవర్గ వెనుకబడిపోయిందని అన్నారు. బడుగు బలహీన వర్గాల బిడ్డగా, తెలంగాణ ఉద్యమకారుడిగా తను ఎమ్మెల్యేగా గెలిపిస్తే, మాజీ ఎమ్మెల్యేలైన, బొప్పరాజు లక్ష్మీ కాంతారావు, దేశిని చిన మల్లయ్య, బొమ్మ వెంకన్న, చాడ వెంకట్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి ల స్ఫూర్తి తో నియోజకవర్గ అభివృద్ధిపై పాటు పడతానని అన్నారు. పొన్నం తో పాటుగా పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓటు వినియోగించుకున్నారు. అనంతరం హుస్నాబాద్ నియోజక వర్గం లోని పలు గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

# శ్వాసకోశ సంబంధ వ్యాధులపై ఆబ్జెక్టివ్ స్ట్రక్చర్డ్ క్లినికల్ ఎగ్జామినేషన్ వర్క్ షాప్



**సికింద్రాబాద్ నవంబర్ 30 (ప్రజామంటలు):** హైదరాబాద్ లో జరుగుతున్న శ్వాసకోశ సంబంధ జాతీయ వైద్య సదస్సులో భాగంగా, కిమ్స్ సన్ షైన్ హాస్పిటల్ లో ఆబ్జెక్టివ్ స్ట్రక్చర్డ్ క్లినికల్ ఎగ్జామినేషన్ వర్క్‌షాప్ ను గురువారం నిర్వహించారు. ఈ వర్క్ షాప్ లో వివిధ శ్వాసకోశ సంబంధ వ్యాధులు, శ్వాసకోశ విభాగంలో వస్తున్న నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక చికిత్స లపై పీజీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వర్క్‌షాప్ సంచాలకులుగా డాక్టర్ బసంత్ హజారిక, డాక్టర్ లక్ష్మణ్ బాబులు వ్యవరించారు. డాక్టర్ భారత్ కత్తి, డాక్టర్ యుగవీర్, డాక్టర్ రఘు, డాక్టర్ ఎమ్. పాత్రో, డాక్టర్ శ్రీకాంత్, శిరీష్ ల తో పాటు పలువురు సీనియర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్ లో వివిధ రాష్ట్రాలకు చెందిన 100 మంది పిజి విద్యార్థులు పాల్గొన్నారు మరో మూడు రోజులపాటు హెచ్ఐ సీసీలో జరగనున్న జాతీయ శ్వాసకోశ వైద్య నిపుణుల సదస్సులో పలువురు అంతర్జాతీయ, జాతీయ వైద్య నిపుణులు పాల్గొంటారని జాతీయ సంచాలకులు డాక్టర్ ఆర్. విజయ కుమార్, డాక్టర్ కంది శుభాకర్ లు తెలిపారు.

# జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్ జెండర్స్



**జగిత్యాల నవంబర్ 30 ( ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కును ట్రాన్స్ జెండర్స్ వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవడం కనీస బాధ్యత అని సమర్థవంతమైన నాయకున్ని ఎన్నుకోవాలని తెలిపారు. ట్రాన్స్ జెండర్స్ ల సమస్యలు గత ప్రభుత్వాలకు తమ సమస్యలను విన్నవించుకున్న పరిష్కారం కాలేవని ఇప్పుడు వచ్చే నూతన ప్రభుత్వం ట్రాన్స్ జెండర్స్ ల సమస్యలు పరిష్కరించాలని కోరారు.

# ఎన్నికల సరళిని పరిశీలించిన గెల్లు శ్రీనివాస్ యాదవ్



**జమ్మికుంట నవంబర్ 30 (ప్రజామంటలు):** గురువారం జరిగిన సాధారణ అసెంబ్లీ ఎన్నికల సరళిని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ హుజురాబాద్ నియోజకవర్గంలో జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట, కొత్తపల్లి లో పోలింగ్ జరుగుతున్న సరళిని స్థానిక నాయకులను అడిగి తెలుసుకున్నరు. తన వెంట బీ ఆర్ ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవాల హరిబాబు, స్థానిక కౌన్సిలర్ మద్ది లావణ్య, దయ్యాల శ్రీనివాస్, బీఆర్ఎస్ జమ్మికుంట టౌన్ అధ్యక్షులు టంగుటూరి రాజ్ కుమార్ వున్నారు.

# బీ ఆర్ ఎస్ పార్టీ ప్రభంజనం తథ్యం

## బోయినపల్లి వినోద్ కుమార్



**కరీంనగర్ నవంబర్ 30 (ప్రజామంటలు):** రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం అసెంబ్లీ ఎన్నిక పోలింగ్ సందర్భంగా కరీంనగర్ నగరంలోని ముకరంపుర ప్రభుత్వ బాలికల ఉర్దు పాఠశాలలో వినోద్ కుమార్ తన సతీమణి డాక్టర్ మాధవి, కుమారులు డాక్టర్ ప్రతీక్, ప్రణయ్ లతో కలిసి ఓటు వేశారు. ఓటు వేసిన అనంతరం వినోద్ కుమార్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీ ఆర్ ఎస్ పార్టీ ప్రభంజనం సృష్టిస్తుందని, మూడవ సారి కూడా సీఎంగా కేసిఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం తథ్యం అని పేర్కొన్నారు.

# కేయు డిగ్రీ ఫలితాల విడుదల



**హన్మకొండ నవంబర్ 30 (ప్రజామంటలు):** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి, రెండవ మరియు మూడవ (ఇయర్ వైజ్) సంవత్సర ఫలితాలను విడుదల చేసినట్లు విశ్వవిద్యాలయ కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాస రావు, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య పి మల్లారెడ్డి తెలిపారు. ఆర్ట్స్ విభాగం లో 81 శాతం, బి బి ఎం లో 89 శాతం, బి.కామ్. లో 64 శాతం, బిజెడ్‌సి లో 64 శాతం, ఎంపిసి లో 72 శాతం ఉత్తీర్ణత సాదించినట్టు పేర్కొన్నారు. వివరాలను విశ్వవిద్యాలయ వెబ్ సైట్ లో చూడవచ్చని పేర్కొన్నారు.

# జగిత్యాల జిల్లా పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు

## జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్, ఐపీఎస్



**జగిత్యాల నవంబర్ 30 (ప్రజామంటలు):** నిర్వహిస్తున్న శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగినట్లుగా జిల్లా ఎస్పీ తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ప్రజలు స్వేచ్ఛగా, స్వతంత్రంగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు మరియు ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం పర్యటిస్తూ శాంతిభద్రతలను పర్యవేక్షిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులకు మరియు సిబ్బందికి ఎస్పీ భద్రత పరమైన పలు సూచనలు చేశారు.

# దక్షిణాఫ్రికా టూర్‌లో హిట్ మ్యానే కీలకం



వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శన చేసినా ఫైనల్‌లో దురదృష్టం వెక్కిరించింది. ఆస్ట్రేలియా చేతిలో భారత జట్టు పరాజయం పాలైంది. ప్రపంచకప్ తర్వాత ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఉన్నప్పటికీ.. దక్షిణాఫ్రికా పర్యటనతోనే టీమిండియాకు అసలైన పరీక్ష ప్రారంభం కానుంది. దక్షిణాఫ్రికాతో డిసెంబర్ 10 నుంచి సిరీస్ ప్రారంభం కానుంది, దీనికి గురువారం (నవంబర్ 30) జట్టును ప్రకటించవచ్చు. అయితే, ఈ సిరీస్‌లో కెప్టెన్ రోహిత్ శర్మ మూడు ఫార్మాట్‌లకు అందుబాటులో ఉంటాడా లేదా అనే సందేహం ఇంకా మిగిలి ఉంది. విరాట్ కోహ్లీ ఇప్పటికే వైట్ బాల్ ఫార్మాట్‌కు దూరమయ్యాడు. కాబట్టి రోహిత్ శర్మ ఇక్కడ అందుబాటులో ఉండాలని అందరూ భావిస్తున్నారు. ఇక సౌతాఫ్రికా టూర్ గురించి మాట్లాడుకుంటే టీమ్ ఇండియా ఇక్కడ 3 టీ20, 3 వన్డేలు, రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. మొత్తం జట్టును బీసీసీఐ గురువారం ప్రకటించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రపంచ కప్ తర్వాత, సీనియర్ ఆటగాళ్లు విశ్రాంతి తీసుకుంటున్నారని, మిగిలిన జట్టు ఆస్ట్రేలియాతో సిరీస్ ఆడుతున్నారని మీకు తెలియజేద్దాం. దక్షిణాఫ్రికా పర్యటన ముఖ్యమైనది. పైగా చాలా కీలకం. కాబట్టి టీమ్ ఇండియా బలమైన టీమ్‌ను పంపాలని భావిస్తోంది. ఇక ఈ టూర్‌లో టెస్టు సిరీస్‌కు మాత్రమే అందుబాటులో ఉంటానని విరాట్ కోహ్లీ ఇప్పటికే సూచించినందున, మరికొందరు ఆటగాళ్లకు అవకాశం లభించే అవకాశం ఉంది. వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ఓటమితో రోహిత్ శర్మ పూర్తిగా సైలెంట్ అయిపోయాడు. ఫైనల్ తర్వాత అతను ఎక్కడా కనిపించలేదు. ఆసీస్ చేతిలో ఓటమి తర్వాత ఏడుస్తూ డ్రెస్సింగ్ రూమ్‌కి వెళ్లిన దృశ్యం అందరికీ గుర్తుంది. ఇప్పుడు దక్షిణాఫ్రికా టూర్ నుంచి కొత్త ఛాలెంజ్ మొదలుకానుంది. కోహ్లీ లాంటి సీనియర్ ఆటగాడు ఇక్కడ లేనందున, రోహిత్ అందుబాటులో ఉండాలని బోర్డు కోరుకుంటుంది. జూన్‌లో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌కు రోహిత్ అందుబాటులో ఉంటే ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకునే అవకాశం ఉంది. అయితే టీ20 ప్రపంచ కప్ 2022 సెమీ-ఫైనల్‌లో ఓటమి తర్వాత రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌లో మ్యాచ్ లు ఆడలేదు. రోహిత్ దక్షిణాఫ్రికా సిరీస్‌కు అందుబాటులో ఉంటే ఐపీఎల్‌తో పాటు టీ 20 ప్రపంచ కప్‌కు కూడా సిద్ధం కావచ్చు.

### దక్షిణాఫ్రికాలో రోహిత్ శర్మ రికార్డులు..

**6 టీ20లు- 135 పరుగులు**
**14 వన్డేలు- 256 పరుగులు, 1 సెంచరీ**
**4 టెస్టులు- 123 పరుగులు**

**దక్షిణాఫ్రికాలో భారత్ పర్యటన వివరాలివే..**
**తొలి టీ20: డిసెంబర్ 10**
**రెండో టీ20: డిసెంబర్ 12**
**మూడో టీ20: డిసెంబర్ 14**
**మొదటి వన్డే: 17 డిసెంబర్**
**రెండో వన్డే: డిసెంబర్ 19**
**మూడో వన్డే: డిసెంబర్ 21**
**మొదటి టెస్ట్: డిసెంబర్ 26-30**

## నాలుగో టీ20లో ఆడనున్న శ్రేయాస్ అయ్యర్




వన్డే ప్రపంచకప్ తర్వాత భారత జట్టు ప్రస్తుతం స్వదేశంలో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడుతోంది. ఇప్పటికే మూడు మ్యాచ్‌లు ముగియగా సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని టీమిండియా 2-1 ఆధిక్యంలో నిలిచింది. మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాయ్‌పూర్‌లోని షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో నేడు భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య నాలుగో టీ20 జరగనుంది. ఈమ్యాచ్‌లో టీమిండియాలో ఒక భారీ మార్పు జరగనుంది. వరల్డ్ కప్‌లో పరుగుల వర్షం కురిపించిన శ్రేయస్ అయ్యర్ ఈ మ్యాచ్‌లో ఆడనున్నాడు. వన్డే ప్రపంచకప్ తర్వాత ఆసీస్‌తో టీ20 సిరీస్‌లో తొలి మూడు మ్యాచ్‌ల నుంచి విశ్రాంతి తీసుకున్న అయ్యర్ ఇప్పుడు నాలుగో, ఐదో మ్యాచ్‌లకు టీమ్‌ఇండియాతో జతకట్టాడు. అద్భుత ఫామ్‌లో ఉన్న అయ్యర్ ఈ టీ20 సిరీస్‌లో వైస్ కెప్టెన్‌గా కూడా ఉన్నాడు. శ్రేయాస్ అయ్యర్ నాలుగో టీ20కి ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకోవడం ఖాయం. ఎప్పుడూ మిడిలార్డర్‌లో ఆడే అయ్యర్ తిలక్ వర్మ స్థానంలో అయ్యర్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చే అవకాశం ఉంది.

ప్రస్తుతం రింకూ సింగ్ కొత్త ఫినిషర్‌గా తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నాడు. కాబట్టి భారత జట్టు అతని స్థానంలో ఎలాంటి మార్పులు చేయనట్లు తెలుస్తోంది. అయ్యర్ టాప్-4లో బ్యాటింగ్ చేయాలనుకుంటే, టాప్-3లో ఒక బ్యాటర్‌కు విశ్రాంతి ఇవ్వవచ్చు. ఈ సిరీస్‌లో భారత్‌కు రుతురాజ్ గైక్వాడ్, యశస్వి జైస్వాల్ ఓపెనర్లు. ఇషాన్ కిషన్ మూడో స్థానంలో ఆడుతున్నాడు. గత మ్యాచ్‌లో రుతురాజ్ సెంచరీ సాధించాడు. ఈ సిరీస్‌లో కిషన్ 2 అద్భుత అర్ధసెంచరీలు చేశాడు. యశస్వి కూడా అద్భుతంగా ఆడుతున్నాడు. గైక్వాడ్-యశస్వి-కిషన్ ఈ ముగ్గురు ఆటగాళ్లు తదుపరి టీ20 ప్రపంచకప్ దృష్ట్యా టీమ్ ఇండియాకు కీలకం. కాబట్టి వీరిని ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించదు. కాబట్టి తిలక్ వర్మ స్థానంలో అయ్యర్ ఆడటం దాదాపు ఖాయం. అలాగే దీపక్ చాహర్ కూడా నాలుగో టీ20లో స్థానం దక్కించుకోనున్నట్లు తెలుస్తోంది.

### భారత జట్టు:

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, యస్సవి జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింఘోయ్, పర్దీష్ కృష్ణ, అవేష్ ఖాన్, ముఖేష్ కుమార్.

### ఆస్ట్రేలియా జట్టు:

మాథ్యూ వేడ్ (కెప్టెన్), జాసన్ బెహ్రెన్‌డార్ఫ్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, క్రిస్ గ్రీన్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, బెన్ మెక్‌డెర్మాట్, జోష్ ఫిలిప్, తన్వీర్ సంఘా, మాట్ షార్ట్, కేన్ రిచర్డ్‌సన్.

## 10 డిసెంబరు 2న ప్రారంభం కానున్న ప్రో కబడ్డీ లీగ్ సీజన్

కబడ్డీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రో కబడ్డీ లీగ్ సీజన్ 10 డిసెంబరు 2న ప్రారంభం కానుంది. అహ్మదాబాద్‌లోని ట్రాన్స్‌స్టేడియాలోని ఏకా అరేనా గ్రౌండ్ వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సీజన్ మ్యాచ్ లు 2024 ఫిబ్రవరి 21 వరకు జరగనున్నాయి. ఇదిలా ఉంటే.. ప్లే ఆఫ్‌లకు సంబంధించి షెడ్యూల్ త్వరలోనే తెలపనున్నారు. మరోవైపు పో కబడ్డీ సీజన్ 10 కోసం తెలుగు టైటాన్స్ కొత్త జట్టును ప్రకటించింది. ప్లేఆఫ్ రౌండ్‌లోకి ప్రవేశించిన టాప్ సిక్స్‌తో ఇతర 11 జట్ల మాదిరిగానే తెలుగు టైటాన్స్ 22 లీగ్ దశ మ్యాచ్‌లు ఆడుతుంది. తెలుగు టైటాన్స్ సీజన్ 10కి పవన్ కుమార్ షెరావత్‌ను కెప్టెన్‌గా, పర్వేష్ భైన్‌స్వాల్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా.. తెలుగు టైటాన్స్ టీమ్ యజమాని గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ.. "ఇండియా ఇంటర్నేషనల్ పవన్ కుమార్ షెరావత్‌ను ఈ ఏడాది వేలంలో రికార్డు స్థాయిలో రూ. 2.605 కోట్లకు తెలుగు టైటాన్స్ సొంతం చేసుకుంది. లీగ్ చరిత్రలో అత్యధికంగా చెల్లించిన ఆటగాడిగా నిలిచాడు. కబడ్డీ క్రీడను కొనసాగించే వారందరికీ జీవితంలో, వృత్తిలో గౌరవ భావాన్ని తెలుగు టైటాన్స్ తీసుకువచ్చింది. లీగ్ (%ూఖూ%) 2014లో ప్రారంభమైనప్పటి నుండి ఆకాశమే హద్దుగా ఈ క్రీడ విస్తరించింది. అశేషమైన అభిమానులకు ఇష్టమైన క్రీడగానూ మారింది " అని అన్నారు. తెలుగు టైటాన్స్ సీఈఓ త్రినాథ్ రెడ్డి మాట్లాడుతూ.. "ప్రపంచంలోని అత్యుత్తమ కబడ్డీ అథ్లెట్లు తెలుగు టైటాన్స్‌లో ఆడేలా చూసుకున్నాము. నేడు, దేశంలోని అన్ని ప్రాంతాల్లో కబడ్డీ ఆడే యువత చాలా ఎక్కువ. అత్యధిక ధర పలికిన వ్యక్తిగా పవన్ తన రికార్డును తిరిగి పొందడం చాలా సంతోషంగా ఉంది. ఇది ఆర్థికంగా లాభదాయకమైన మోడల్‌ను అభివృద్ధి చేసింది. ఇది క్రీడతో సంబంధం ఉన్న అథ్లెట్ల కలలకు రెక్కలు ఇచ్చింది%ొ%" అని అన్నారు. ఇదిలా ఉంటే.. ప్రో కబడ్డీ లీగ్ 2023-24 సీజన్ భారతదేశంలోని స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయబడుతుంది. అదే సమయంలో, స్టార్ నెట్‌వర్క్‌లో వివిధ ప్రాంతీయ భాషల్లో గేమ్‌లను కూడా ఆస్వాదించవచ్చు. లీగ్ మ్యాచ్‌లను డిస్నీ హాట్‌స్టార్‌లో కూడా ఉచితంగా వీక్షించవచ్చు.

## టీమిండియాకు ఊరట..

### స్వదేశానికి వెళ్లిపోయిన మ్యాక్స్‌వెల్

టీమ్ ఇండియాతో జరుగుతోన్న 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆస్ట్రేలియా అద్భుతంగా పునరాగమనం చేసింది. ఈ సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో టీమిండియా విజయం సాధించింది. అయితే మూడో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించి సిరీస్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. కాబట్టి సిరీస్‌లో నాలుగో మ్యాచ్ మరింత ఆసక్తికరంగా మారింది. సిరీస్‌లో నిలవాలంటే ఆస్ట్రేలియా నాల్గవ మ్యాచ్‌లో ఎలాగైనా గెలవాలి. అదే సమయంలో ఈ మ్యాచ్ గెలిస్తే టీమ్ ఇండియా సిరీస్ కైవసం చేసుకుంటుంది. రాయ్‌పూర్ వేదికగా భారత్, ఆస్ట్రేలియా మధ్య నాలుగో టీ20 మ్యాచ్ జరగనుంది. శుక్రవారం (డిసెంబర్ 1)న షహీద్ వీర్ నారాయణ్ సింగ్ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఇరు జట్లు తలపడనున్నాయి. ఈ మైదానంలో ఇది తొలి అంతర్జాతీయ టీ20 మ్యాచ్ కాగా ఇంతకు ముందు ఈ మైదానంలో ఒకే వన్డే మ్యాచ్ జరిగింది. ఇందులో న్యూజిలాండ్ జట్టుపై టీమిండియా 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా గౌహతిలోని బర్సపరా క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన మూడో టీ20లో ఆస్ట్రేలియా ఏడు వికెట్ల తేడాతో భారత జట్టుపై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో ఇరు జట్లకు నాలుగో టీ20 మ్యాచ్ నిర్ణయాత్మకంగా మారింది.

### స్వదేశానికి వెళ్లి పోయిన మ్యాక్సీ, స్టొయినిస్

కాగా మూడో టీ 20 మ్యాచ్‌లో భారీ సెంచరీతో ఆస్ట్రేలియాను ఒంటి చేత్తో గెలిపించిన పించ్ హిట్టర్ గ్లెయిన్ మ్యాక్స్ వెల్ స్వదేశానికి వెళ్లిపోయాడు. భారత్‌తో జరిగే మిగతా రెండు టీ20 మ్యాచ్‌లకు టీమ్ మేనేజ్‌మెంట్ మ్యాక్సీకి రెస్ట్ ఇచ్చింది. దీంతో అతను స్వదేశానికి వెళ్లిపోయాడు. మ్యాక్సీతో పాటు స్టీవ్ స్మిత్, ఆడమ్ జంపా, జోస్ ఇంగ్లిస్, సీన్ అబాట్, మార్కస్ స్టొయినిస్ కూడా స్వదేశానికి వెళ్లిపోయారు.

### భారత జట్టు:

సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్, ఇషాన్ కిషన్, యస్సవి జైస్వాల్, తిలక్ వర్మ, రింకూ సింగ్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్, శివమ్ దూబే, రవి బిష్ణోయ్, అర్షదీప్ సింఘోయ్, పర్దీష్ కృష్ణ, అవేష్ ఖాన్, ముఖేష్ కుమార్.

### ఆస్ట్రేలియా జట్టు:

మాథ్యూ వేడ్ (కెప్టెన్), జాసన్ బెహ్రెన్‌డార్ఫ్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, క్రిస్ గ్రీన్, ఆరోన్ హార్డీ, ట్రావిస్ హెడ్, బెన్ మెక్‌డెర్మాట్, జోష్ ఫిలిప్, తన్వీర్ సంఘా, మాట్ షార్ట్, కేన్ రిచర్డ్‌సన్.

## చెన్నై కెప్టెన్సీని రిజెక్ట్ చేసిన సంజూ



ఐపీఎల్-2024 మిని వేలంకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో అనేక రూమర్స్ తెరపైకి వస్తున్నాయి. అయితే వీటిపై ఆయా స్టార్ ఆటగాళ్లు స్పందించని తరుణంలో నెటిజన్లు అవే నిజమనుకుని నమ్ముతున్నారు. తాజాగా సంజూ శాంసన్ విషయంలోనూ అదే జరిగింది. తాజాగా ఈ రాజస్థాన్ ప్లేయర్ గురించి నెట్టింట ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. సంజూకు కెప్టెన్సీకి సంబంధించిన ఆ వార్తలు ఇప్పుడు టాక్ ఆఫ్ ద టౌన్‌గా మారాయి. త్వరలో సంజూ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆ న్యూస్‌సారంశం. అయితే ఈ విషయాన్ని వెటెరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో చెప్పాడంటూ ఓ యూజర్ ట్విట్టర్‌లో రాసుకొచ్చాడు.

"తమ కెప్టెన్‌గా రావాలని చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ.. సంజూ శాంసన్‌కు భారీ ఆఫర్ ఇచ్చింది. అందుకు సంబంధించి ప్రణాళికలను కూడా సిద్ధం చేసింది. అయితే సంజూ ఈ ఆఫర్‌ను రిజెక్ట్ చేశాడు. కానీ భవిష్యత్తులో మాత్రం సంజూను సీఎస్‌కే కెప్టెన్?గా చూడటం ఖాయం" అని అశ్విన్ చెప్పినట్లు ఆ ట్వీట్?లో రాసుంది. అయితే అవన్నీ నిజం కావంటూ అశ్విన్ ఆ ట్వీట్?కు రిప్లై ఇచ్చాడు. "ఇవన్నీ అసత్యపు వార్తలు. అబద్ధాల ప్రచారానికి నా పేరును వాడకండి" అంటూ వార్నింగ్ ఇచ్చాడు. అయితే ఇదే విషయంపై సంజూ ఫ్యాన్స్? కూడా నెట్టింట కామెంట్లు పెడుతున్నారు."రాయల్స్‌ను విజయపథంలో నడిపిస్తున్న సంజూకు ఆ జట్టును వీడాల్సిన అవసరం లేదు. ఒకవేళ అతడు ధోని వారసుడిగా చెన్నై జట్టుకు కెప్టెన్ అవ్వాలనుకుంటే అందులో తప్పేం లేదు" అని కామెంట్లు చేస్తున్నారు. ఇటీవలే ఆస్ట్రేలియాతో జరుగుతున్న టీ20 సిరీస్?కు శాంసన్‌ను ఎంపిక చేయకపోవడాన్ని పట్ల పార్లమెంట్? సభ్యుడు శశి థరూర్ తప్పుబట్టిన విషయం తెలిసిందే. ఇదొక అన్యాయమైన చర్యగా శశి పేర్కొన్నారు. అయితే ఇదే విషయం గురించి సంజూ స్పందించాడు. ప్రజలు నన్ను అత్యంత దురదృష్టకరమైన క్రికెటర్ అని పిలుస్తుంటారు. కానీ నాకు మాత్రం అలా అనిపించడం లేదు. ప్రస్తుతం నేను ఏ స్థాయిని చేరుకున్నానో నాకు తెలుసు. అనుకున్నదానికంటే ఇది చాలా ఎక్కువ అని నేను అనుకుంటాను.." అని శాంసన్ అన్నాడు.



అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఓటు వేసిన ఓటర్లు తమ మనోభావాలను వ్యక్తపరుస్తూ ప్రజాస్వామ్య మునగడకు ఓటు బ్రహ్మాస్త్రం లాంటిదని, మేము ఓటు వేసాము అందరూ ఓటు వేయాలని తెలిపిన యువతీ యువకులు



**తొలిసారి తన ఓటు వినియోగించుకొనటానికి యూఎస్ఏ నుండి జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన కుశాల్. ప్రజాస్వామ్యంలో ఓటు చాలా విలువైనదని, ఓటు వినియోగించుకున్నందుకు సంతోషం వ్యక్తం చేసాడు.**




జగిత్యాల జిల్లా కేంద్రంలో అసెంబ్లీ ఎన్నికలకు గాను "యూత్ మోడల్ పోలింగ్ కేంద్రం 113" జగిత్యాల మండలం గోపాలరావుపేట్, తిప్పన్నపేటలో ఏర్పాటు చేశారు. దీనికిగాను యువతను ఆకర్షించడానికి ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా మహిళల కోసం ప్రత్యేక ఆదర్శ కేంద్రంగా జిల్లా కేంద్రంలోని అటవీశాఖ కార్యాలయంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం గౌతమ మోడల్ స్కూల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## ఓటు హక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్



**జమ్మికుంట నవంబర్ 30 (ప్రజామంటలు):** ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకో వాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం మండలంలోని సింగపూర్ గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకున్ని ఎన్నుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఒడితల ప్రణవ్ తల్లిదండ్రులు వొడితల శ్రీనివాసరావు, పద్మశ్రీ, భార్య మృణాళిని లు ఓటు హక్కు ను వినియోగించుకున్నారు.

## ఉత్సాహంగా మొదటిసారి ఓటు వేసిన యువత



**సికింద్రాబాద్ నవంబర్ 30 (ప్రజామంటలు):** గురువారం జరిగిన సాదారణ ఎన్నికల్లో కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీ, యువకులు పెద్ద సంఖ్యలో మొదటి సారిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉత్సాహంగా తమ, తమ పోలింగ్ స్టేషన్ లకు చేరుకున్న వీరు ఓటు వేశాక, అక్కడనే సెల్ఫీ దిగి వాట్సాప్ స్టేటస్, ఇన్ స్టా, ఫేస్ బుక్ లాంటి సోషల్ మీడియా సైట్ లో పోస్టు చేసుకున్నారు. మొదటిసారిగా ఓటు వేయడం కొత్తగా అనిపించిందని, ఐదేండ్ల పాటు మనల్ని పాలించే వారిని మనమే ఎన్నుకోవడం బాగుందన్నారు.

## కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్



**జమ్మికుంట నవంబర్ 30 (ప్రజామంటలు):** హుజురాబాద్ నియోజకవర్గం లోని ప్రజలకు, ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల ప్రణవ్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... హుజురాబాద్ నియోజకవర్గంలో గ్రామ గ్రామానికి ప్రచారంలో పాల్గొనగా పెద్ద ఎత్తున మహిళలు మంగళహారతులతో, పూలతో ఆదరిస్తూ స్వాగతం పలికిన ప్రతి మహిళ సోదరికి, అత్యంత ఆప్యాయంగా అడుగడుగునా వెన్నంటూ ఉండి ప్రచారంలో అండగా నిలిచిన ప్రతి ఒక్క కార్యకర్తకు ధన్యవాదాలు తెలుపుతూ నాపై నమ్మకంతో చేతి గుర్తుకు వేసి గెలిపిస్తున్న నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.